
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 28.08.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 13 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# హోదా వద్దు.. ప్యాకేజీ ముద్దు!

## » పార్లమెంటులో ఆమోదించిన ప్రత్యేకహోదా సాధనపై చంద్రబాబుకు ఆసక్తి లేనిదెందుకు?

## » చెప్పిన మాటకు కట్టుబడి హోదా ఇవ్వడానికి కేంద్రానికి ఉన్న అడ్డంకులేంటి?



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా హక్కు. దీనికోసం భిక్షమెత్తాల్సిన పని లేదు. కేంద్రం ముందు దేబిరించాల్సిన అవసరం లేదు. భారతదేశంలో వున్న అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల సాక్షిగా పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామన్న అవకాశం ఇది. గతంలో ఎన్నో రాష్ట్రాల విభజన జరిగింది. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ పడినంత బాధ ఏ రాష్ట్రమూ పడలేదు. దీనిని బాధ అనడం కంటే క్షోభ అంటే సరిపోతుందేమో! నెలలు నిండాక ప్రసవం ఎంతో హాయిగా ఉంటుంది. కాని ఆంధ్రప్రదేశ్ విభజన మాత్రం నెలలు నిండకుండానే కడుపు కోసి బిడ్డను తీసినట్లుగా జరిగింది.

ఇలాంటి రాక్షసత్వ విభజనకు పూర్తిగా బలైంది ఆంధ్రరాష్ట్రం. ఎంత చేసినా, ఏం చేసినా ఈ రాష్ట్రం ఇప్పట్లో కోలుకునే పరిస్థితులు లేవు. రాష్ట్ర విభజన సమయంలో సిపిఎం వంటి ఒకటి, అరా పార్టీలు తప్పితే మిగతా అన్ని పార్టీలు కూడా ఆంధ్రకు తీరని ద్రోహం చేసాయి. ఈ ద్రోహుల్లో మొదటి ముద్దాయి కాంగ్రెస్ అయితే రెండో ముద్దాయి బీజేపీ. విభజన సమయంలో కాంగ్రెస్ మరీ ఎంత దుర్మార్గంగా వ్యవహరించిందంటే రాష్ట్రానికి ప్రత్యేకహోదా అంశాన్ని కనీసం విభజన బిల్లులో కూడా పొందుపరచలేదు. రాజ్యసభలో బిల్లును బీజేపీ అడ్డుకోబట్టయినా ఆ మాత్రం ఐదేళ్ల ప్రత్యేకహోదా కల్పిస్తామంటూ ప్రధాని హోదాలో మన్మోహన్‌సింగ్ వచ్చి హామీ ఇచ్చారు.

(మిగతా 11వ పేజీలో)



## జగన్ తలచుకుంటే...

# భూ దందాకు బ్రేక్

అమరావతి రాజధాని రైతులకు చంద్రబాబు అరచేతిలో స్వర్గం చూపించాడు. అలా చూపించి ఆ మైకంలోనే రైతుల భూములను లాక్కున్నారు. 33వేల ఎకరాల భూములు పోగైనా చంద్రబాబు సిండికేట్‌కు ఇంకా భూదాహం తీరినట్లు లేదు. భూసేకరణ పేరుతో మరికొన్ని వేల ఎకరాలు దోచేయడానికి శ్రీకారం చుట్టడం తెలిసిందే! దీనిమీదే పవన్‌కల్యాణ్‌తో పాటు అన్ని విపక్షాలు కూడా గొడవ చేస్తున్నాయి.

రాజధాని రైతులకు చంద్రబాబు ఏ స్థాయిలో ఆశ కల్పించాడంటే... రాజధానిలో రైతుల వాటా క్రింద ఇస్తున్న స్థలానికి ఇప్పుడు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో రేటు లెక్కకట్టి చెప్పారు. అమరావతి రాజధానిలో అంకణం స్థలం రేటు ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో వున్న అంకణం స్థలం రేటును చేరుకోవాలంటే ఈ శతాబ్దం చాలదేమో! అమరావతి రాజధానిలో స్థలాలకు రేట్లు రావడం, అమ్ముకోవడం ఖచ్చితంగా ఈ తరం వారికి సాధ్యమయ్యే పని కాదు.

రాజధాని పేరుతో దాదాపు 50వేల ఎకరాల పంట పొలాలు ధ్వంసం కానున్నాయి. సాలీనా ప్రత్యక్షంగా పరోక్షంగా 50వేల కుటుంబాల దాకా ప్రభావితం కానున్నాయి. భవిష్యత్‌లో అక్కడి రైతులు...

(మిగతా 11వ పేజీలో)



## జిఎస్ఎల్వి-డి6 సూపర్‌సక్సెస్

## వినీలాకాశంలో

# విజయగీతిక

(వివరాలు 3వ పేజీలో)



## మెగా ఫ్యామిలీ...

# మెగా డ్రామా!

సినీ పరిశ్రమలో ఎటువంటి పునాది లేకుండా జీరో స్థాయి నుండి సుప్రీంహీరో స్థాయికి చేరిన వ్యక్తి, రాజకీయాల్లో పునాది వుండి కూడా హీరో స్థాయి నుండి జీరోస్థాయికి పడిపోయిన వ్యక్తి... మెగాస్టార్ చిరంజీవి. తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవి రారాజే! ఎందుకంటే అతని తండ్రి నిర్మాత కాదు, దర్శక, హీరో కాదు. ఎటువంటి వారసత్వం లేకుండానే స్వయంకృషితో ఎదిగాడు చిరంజీవి. సినీ పరిశ్రమలో చిరంజీవి ప్రస్థానాన్ని ఎవరూ వేలెత్తి చూపలేరు. కష్టపడి పైకి రావాలనుకునే వారికి చిరంజీవి ఒక రోల్‌మోడల్ కూడా!

అయితే రాజకీయ రంగంలోకి వచ్చేసరికి ఆయన అట్టర్‌ఫ్లాప్ హీరో. 2009ఎన్నికల్లో 'ప్రజారాజ్యం' ఫ్లాప్‌షోగా మిగిలిపోయింది. ఏడాది తిరక్కముందే ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌కు అమ్మేసుకున్నాడు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ అధిష్టానాన్ని ఎదిరించలేక విభజన ద్రోహుల్లో ఒకడిగా మిగిలిపోయాడు. ఏళ్ల తరబడి సినీ ఇండస్ట్రీలో సంపాదించుకున్న మంచిపేరునంతా రాజకీయాల్లోకి వచ్చి ఏడాదిలో పోగొట్టుకున్నాడు. మొన్న మెగాస్టార్ చిరంజీవి 60వ జన్మ దినోత్సవాన్ని అభిమానులు రాష్ట్ర వ్యాప్తంగా ఒక

(మిగతా 11వ పేజీలో)

# భక్తజన సంద్రంగా..గొలగమూడి


## వైభవోపేతంగా 33వ ఆరాధన మహోత్సవాలు



సింహపురి సమాచారం



గొలగమూడిలో వెలసివున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి 33 వ ఆరాధనా మహోత్సవాలు ఈ నెల 18 నుంచి 24వ తేది వరకు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆరాధనోత్సవాలకు భక్తులు వెల్లువలా తరలివచ్చారు. ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో వాహన సేవలు అత్యద్భుతంగా జరిగాయి. నిత్య పూజలతో, ప్రత్యేక సేవలతో వెంకయ్యస్వామి ఆరాధన ఎంతో భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. జిల్లానుంచే కాక, తమిళ నాడు, కర్నాటక తదితర దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఉత్సవాలకు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇ.ఓ పి. బాలసుబ్రహ్మణ్యం నేతృత్యంలో ఈ ఉత్సవాలు కనువిందుగా జరిగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజున ఎంతో ప్రధానమైన ఆరాధన ఉత్సవం సందర్భంగా, మరింత పెద్దసంఖ్యలో వేలాదిగా భక్తులు గొలగమూడికి విచ్చేశారు. ఉదయం స్వామివారికి రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం వైభవోపేతంగా జరిగాయి. ఉదయం రథోత్సవానికి ముందు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారికి పట్టు వస్త్రాలను సంప్రదాయబద్ధంగా తలపై పెట్టుకుని తీసుకునివచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం, రథోత్సవం కనువిందుగా సాగింది. చివరిరోజు ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ శ్రీమతి జానకి విచ్చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆశ్రమ ఇ.ఓ బాలసుబ్రహ్మణ్యం సతీమణి ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువతో సత్కరించగా, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం, ఆలయానికి విచ్చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత రాత్రి కోనేటిలో స్వామివారి తెప్పోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. ఆలయంతో పాటు, పరిసరాలు, గొలగమూడి గ్రామమంతా విద్యుద్దీపకాంతులతో తేజరిల్లుతుండగా, పుష్పాలంకార శోభితులైన స్వామివారు తెప్పోత్సవంలో భక్తులకు కనువిందు చేశారు. 24వ తేది ఆరాధన రోజున స్వామివారి ఆలయం సమీపంలో సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకూ భక్తులు బారులు తీరడం విశేషం. ఎక్కడ చూసినా భక్తజనంతో ఆలయ పరిసరాలన్నీ క్రిక్కిరిసిపోయాయి. భక్తుల కోసం ప్రత్యేకంగా వైభవోత్సవం మండపం వద్ద, కోనేటి వద్ద, ఆలయం ఎదుట పెద్ద షామియానాలు వేసి షెల్టర్లు ఏర్పాటుచేశారు. గొలగమూడికి వేలాదిగా తరలివచ్చిన వాహనాలను కిలోమీటరు దూరంలోనే పార్కింగ్ స్థలాల వద్ద నిలిపివేసి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, మరోవైపు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పోలీసులు రాత్రింబవళ్ళు కృషి చేశారు. నెల్లూరు రూరల్ సిఐ శ్రీనివాసరావు, వెంకటాచలం ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.




## మహిళలకు ఉపాధి అవకాశాలు

నెల్లూరుజిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ గ్రామీణ ఉపాధి శిక్షణా సంస్థలో ఈ నెల 31వ తేదీ నుండి మహిళలకు ఉపాధి అవకావశాలు కొరకు టైలరింగ్, బ్యూటిపార్లర్ మేనేజ్‌మెంట్, జర్దోసి మగ్గం వర్క్స్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు బి.రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలుపైన 45 సంవత్సరాలు వయస్సులోపు వారు తెలుగు చదవడం, రాయగలిగిన వారు అర్హులని తెలిపారు. ఉచిత భోజన వసతి సౌకర్యం కలుగజేస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరదలచుకున్నవారు 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జెరాక్స్ తీసుకురావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు చెందిన వారు కులధృవీకరణ సర్టిఫికేటు, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారైతే మార్కుల లిస్టు జెరాక్స్ కాపీలు తీసుకురావాలని కోరారు. వివరాలకు 0861 – 2383555, 2163783, 94941 33370 నంబర్లలో సంప్రదించాలన్నారు.

# కొత్త సారథి ఎవరు?




**వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి రాజీనామా చేయడం తెలిసిందే! ఇక ఆయన రాజీనామాను వెనక్కి తీసుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలోనే వైకాపా అధిష్ఠానం జిల్లా పార్టీకి కొత్త అధ్యక్షుడిని వెదికే పనిలో పడింది.**

ఇప్పుడు పార్టీ ప్రతిపక్షంలో వుంది. అధ్యక్ష పదవిలో ఖర్చు తప్ప ఆదాయం ఉండదు. పార్టీ ఆఫీసు అద్దె, కరెంట్ బిల్లులు, ధర్నాలు, బందుల ఖర్చులు, ఎట్ల లేదన్నా నెలకు లక్షన్నా తీసి పెట్టాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ఖర్చును భరించగలిగేదెవరు? ఒకవేళ భరించడానికి ముందుకొచ్చినా, వచ్చిన వాళ్లకు కొంతలో కొంతన్నా జిల్లా స్థాయి నాయకత్వ లక్షణాలుండాలి కదా! నల్లపరెడ్డి ప్రసన్న, కాకాణిలు జిల్లా అధ్యక్షులుగా చేసారు. జిల్లాలో అందరికీ తెలిసినవాళ్లు కాబట్టి నెట్టుకొచ్చారు. అలాగే మేరిగ మురళీధర్ కూడా అధ్యక్షుడిగా చేసాడు. ఆయన సొంత మండలంలోనే ఆయన చాలామందికి తెలియదు. ఆర్థిక సమస్యలనే కాదు, నాయకత్వ పరంగా కూడా సమర్థులనే జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చేయాలి. ఈ పరంపరలో జిల్లా అధ్యక్ష పదవికి రెండు పేర్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుత జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలలో ఒకరిని అధ్యక్షుడిగా ఎంపిక చేసే విషయం పరిశీలనలో వున్నట్లుంది.

గతంలో కాకాణి కన్వీనర్‌గా వుండగా ఎలాంటి లోటు పాట్లు లేకుండా కార్యక్రమాలు నడిచాయి. అయితే ఆరోజుల్లో పార్టీ అధికారంలోకి వస్తుందన్న ఆశన్నా వుండింది కాబట్టి ఆ ఆశతో పార్టీని నడిపారనుకోవచ్చు. ఇప్పుడైతే అలాంటి ఆశలు లేవు. ఏదైనా వూహించని సంఘటన జరిగితే తప్పితే ఖాయంగా మూడు ముప్పావు సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉండాల్సిందే! ఈ సమయంలో అధ్యక్ష బాధ్యతలు తీసు కోవడం కీలకం.

జిల్లాలో అజాతశత్రువుగా బొమ్మిరెడ్డి రాఘవేంద్రకు పేరుంది. ఇతర పార్టీల వాళ్ళతో సత్సంబంధాలు కలిగి వుండడమే కాకుండా సొంత పార్టీలో సైతం ఆయన అందరితోనూ బాగుంటాడు. ముఖ్యంగా రాజకీయ కురువృద్ధుడిగా తన తండ్రికి వున్న అపార అనుభవం, తండ్రి ద్వారా తాను నేర్చుకున్న రాజకీయ పాఠాలు రాఘవేంద్రరెడ్డికి బాగా ఉపయోగపడుతున్నాయి. ఒక రకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సైతం పార్టీలో అందరినీ మెప్పించగల సమర్థత ఆయనకుందన్న సందేహం లేదు. సమున్నత సమన్వయకర్తగా, జిల్లా పరిషత్ అధ్యక్షుడుగా అటు పార్టీలోను, ఇటు ప్రభుత్వంతోను సమాంతర లావాదేవీలు జరుపగల వ్యక్తిగా పార్టీ ఆయన్ని చూస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం పై రెండు విషయాలే కాకుండా ఆర్థికంగా సైతం పార్టీని ఆదుకోగల సామర్థ్యం, మనస్తత్వం రాఘవేంద్రరెడ్డికి వున్నాయన్నది వారి అభిప్రాయం. పార్టీని గాడిన పెట్టడంలో ఆయన తప్పక సఫలమవుతాడన్నది కూడా పార్టీ ఆలోచనలో వుంది. పైవాటన్నిటికంటే ముఖ్యంగా ఈ జిల్లాలో ఎవరు అధ్యక్షులైనా పార్టీకంటే ముందు మేకపాటికి సలాం కొట్టాలన్నది జగమెరిగిన సత్యం. అయితే ఆత్మకూరు నియోజకవర్గంలో పట్టు కలిగిన బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి విషయంలో మేకపాటి సైతం పెద్దగా వ్యతిరేకించకపోగా జాగ్రత్తగా వుంటారన్నది కూడా పార్టీ అభిప్రాయంగా వున్నట్లుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే ప్రస్తుతం పార్టీ వున్న పరిస్థితుల్లో రాఘవేంద్రరెడ్డి నాయకత్వమే సముచిత నిర్ణయమవుతుంది.

ఇంకో కోణంలో చూస్తే ప్రతిపక్షం పాత్ర అంటేనే చేతిలో రాయి పట్టుకుని ఏ నిముషమైనా ప్రభుత్వం మీద దాడికి దిగడానికి సిద్ధంగా ఉండడం. ప్రతిపక్షంలో మెత్తగా, సౌమ్యంగా వుంటే కుదరదు. ప్రజాసమస్యలపై సాగించే పోరులో ఫోర్స్ పెంచాలి. కార్యకర్తల్లో వేడి పుట్టించాలి. నాయకులలో సెగ రగిలించాలి. దానికి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అయితేనే కరెక్ట్ అన్నది మరికొంతమంది అభిప్రాయం. అయితే ఆర్థికంగా శ్రీధర్‌రెడ్డి వల్ల పార్టీకి పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చన్న ఆలోచన, మేకపాటితో సమన్వయం చేసుకుని పార్టీని ముందుకు నడిపించగలడా అన్న ప్రశ్న? ఇందుకు వారు కూడా సహకరిస్తారా అన్న ఆలోచన శ్రీధర్‌రెడ్డి అభ్యర్థిత్వానికి బ్రేకులేస్తున్నట్లు పార్టీ వర్గాల భోగట్టా!

ప్రస్తుతానికి అధ్యక్ష పదవి రేస్ వీరిద్దరి మధ్యనే వున్నట్లు తెలుస్తోంది. కొత్త అధ్యక్షుడెవరో త్వరలోనే తేలబోతోంది.

# చదువులే మీ జీవితానికి వెలుగులు


**- జివికె రెడ్డి**




జన్మనిచ్చిన తల్లి, పుట్టిన ఊరి ఋణమెలా తీర్చుకోవాలనేదానికి ఉదాహరణ గునుపాటి వెంకటకృష్ణారెడ్డి. దేశానికి రాజైనా తల్లికి బిడ్డే అయినట్లు... ఆయన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పారిశ్రామికవేత్త అయినా ఇందుకూరుపేటలోని కొత్తూరుకు వస్తే మాత్రం అక్కడి జనంలో ఒకడిగా కలిసిపోతాడు. అందుకే తన గ్రామానికి లెక్క లేకుండా, లెక్క కూడా పెట్టుకోకుండా ఏమేమి కావాలో అన్నీ చేస్తున్నారు. వ్యాపార వ్యవహారాలలో ఎంత బిజీగా వున్నా, తన గ్రామానికి క్రమం తప్పకుండా వచ్చి పోతుంటారు. ఈ క్రమంలోనే ఆయన ఈనెల 26వ తేదీన స్వగ్రామమైన కొత్తూరుకు వచ్చారు. కొత్తూరులోని జివికె చిన్మయ విద్యాలయంలో బుధవారం హెల్త్ సెంటర్‌ను జివికె కుటుంబసభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ చదువు అవసరమని, అప్పుడే తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి దేశానికి, కన్న తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెడతారని అన్నారు. చిన్ననాటి కాలంలో చదువుకునేందుకు సరైన అవకాశాలు లేవని, చెట్లు క్రింద, మిట్ట మీద చదువుకున్నానని తెలిపారు. స్వగ్రామం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. నెల్లూరులోని సెయింట్ జోసెఫ్ ఆసుపత్రి వైద్యులు ప్రతి నెలా విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తారన్నారు. విద్యార్థులు మానసికంగా ఆరోగ్యంగా వున్నప్పుడు చదువుకునేందుకు బాగుంటుందన్నారు. సెయింట్ జోసెఫ్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ బ్రిట్లియా మాట్లాడుతూ పేదలకు వైద్యసేవలు అందించాలన్న కోరికతో వైద్యశాలకు రూ. 1.50కోట్లతో పరికరాలను అందించడం జివికె దాతృత్వానికి నిదర్శనమన్నారు.

ఈ కార్యక్రమంలో జివికె సతీమణి ఇందిరమ్మ, సోదరులు జనార్ధన్‌రెడ్డి, చెల్లెళ్లు నిర్మలమ్మ, విమలమ్మ, లలితమ్మ, కరస్పాండెంట్ గీర్వాణిరెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, సిఇఓ వీరభద్రయ్య పాల్గొన్నారు.

# నింగిని ముద్దాడిన జిఎస్ఎల్‌వి-డి6



అంతరిక్ష ప్రయోగాలలో అంతర్జాతీయంగా అగ్రరాజ్యాలకు ధీటుగా నిలిచిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు ఇంకా కొరుకుడు పడని కొయ్య జిఎస్ఎల్‌వి సిరీస్. ఇస్రోకు పిఎస్ఎల్‌వి సిరీస్ మీద దొరికిన పట్టు జిఎస్ఎల్‌వి మీద దొరకలేదు. జిఎస్ఎల్‌విలో ప్రయోగం జరుగుతుందంటేనే ఎక్కడా లేని టెన్షన్... ఏ మూలో ఒక అపనమ్మకం.


ఆ అపనమ్మకాలు, టెన్షన్లు, అపోహలు పటాపంచలయ్యాయి. తాను కూడా ఇస్రోకు నమ్మకమైన నేస్తాన్నేనని జిఎస్ఎల్‌వి నిరూపించుకుంది. ఆగష్టు 27వ తేదీ సాయంత్రం 4.51గంటలకు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి ప్రయోగించిన జిఎస్ఎల్‌వి-డి6 విజయవంతమైంది. 2117కిలోల బరువుగల జీశాట్-6 ఉపగ్రహాన్ని ఇది నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇస్రో 250కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్ట్ చేపట్టింది. 9ఏళ్ల పాటు ఈ ఉపగ్రహం పనిచేస్తుంది. అంతరిక్షం, రక్షణ, విమానయాన రంగాలలో దీని సేవలను వాడుకోవచ్చు. ఇస్రో ప్రయోగించిన 25వ సమాచార ఉపగ్రహమిది. ఇస్రో ఛైర్మెన్ కిరణ్‌కుమార్, షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్, ఇతర శాస్త్రవేత్తలు ప్రయోగం విజయవంతం అని తెలగానే ఒకర్నొకరు కౌగిలించుకుని అభినందనలు తెలుపుకున్నారు. అంతరిక్షంలో అనితరసాధ్య విజయాన్ని సాధించిన ఇస్రో టీంకు రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ప్రధాని నరేంద్ర మోడీలు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు.

# గిరి మృదులకు డాక్టరేట్



గతంలో నెల్లూరులో సీనియర్ జర్నలిస్ట్‌గా పనిచేసి, అందరికీ సుపరి చితులైన గూడూరు నివాసి దివంగత గిరి రమణయ్య మనుమరాలు గిరి మృదుల ఔషధ రంగంలో డాక్టరేట్ సాధించి తాతయ్య పేరు మరింతగా ఇనుమడింపజేశారు. విద్యారంగంలో ముందంజలో వుంటూ ఆమె తల్లిదండ్రుల కలలను సాకారం చేశారు. గూడూరు పట్టణానికి చెందిన గిరి మృదుల ఔషధ రంగంలో ఎంతో ఆసక్తితో పరిశోధనలు చేసి, తాజాగా జెఎన్‌టియు (జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ) నుంచి పిహెచ్‌డి అందుకున్నారు. చెన్నైలో బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ పూర్తి చేసి, ప్రస్తుతం బెంగుళూరు లోని కృపానిధి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో గిరి మృదుల ఫార్మకాలజీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఇంతవరకు వెలుగులోకి అనేక రకాల ఔషధ మొక్కలు, వాటి రసాయన చర్యల సామర్థ్యాలు, ప్రయోజనాలు తదితర అంశాలను గుర్తించి పరిశోధన చేయడంలో ఆమెకు అధ్యాపకులు డా. బిఎం వృషబేంద్రస్వామి (బెంగుళూరు), డా. కెవిన్ జయవీర్ (అనంతపురం) తగు సలహాలు సూచనలు ఇచ్చి గైడ్లుగా సహకరించినట్లు ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆమెకు 'లాయర్' అభినందనలు.

# జెయస్ రెడ్డికి గోపాలరెడ్డి అవార్డు



గత 18సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రముఖులకు ఇస్తూ వస్తున్న ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు ఈ యేడాది ప్రముఖ కాంట్రాక్టర్ జెయస్ రెడ్డికి ఇస్తున్నారు. జె.యస్.రెడ్డి క్యాన్సర్ ఆసుపత్రి ప్రాంగణంలో జక్కా సుజాతమ్మ క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాన్ని నెలకొల్పడంతో పాటు ఆదిత్యనగర్‌లోని చిల్డ్రన్స్‌పార్క్‌ను జన్మభూమి కార్యక్రమంలో చేపట్టి చిన్నపిల్లలకు కానుకగా ఇచ్చారు. అంతే కాకుండా ఆర్ఎల్‌రెడ్డి పురమందిరాన్ని(టౌన్‌హాలు) తన సొంత నిధులతో ఆధునీకరించి కళా రంగానికి అందించారు. ప్రస్తుతం ఆయనే పురమందిరం కమిటి సెక్రటరీగా కూడా వున్నారు. ఈ నెల 6వ తేదీన టౌన్‌హాల్లో జరిగే ఓ కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలిసింది. గత యేడాది ప్రముఖ సినీనటుడు మోహన్‌బాబుకి అవార్డు ఇచ్చిన సందర్భంగా బెజవాడ ఆడపడుచు మాగుంట కుటుంబీకురాలు శ్రీమతి మాగుంట పార్వతమ్మను తీవ్రంగా నిర్లక్ష్యం చేసారని మనస్తాపం చెందిన బెజవాడ కుటుంబసభ్యులు ఈ అవార్డు కార్యక్రమాన్ని అంతటితో ముగించేస్తున్నట్లు, అందుకోసం ఏర్పాటు చేసిన నిధిని కస్తూరిదేవి విద్యాసంస్థల అభ్యున్నతికి అందజేస్తున్నట్లు తెలిపారు. అయితే జెయస్‌రెడ్డి పేరు గత రెండు సంవత్సరాలుగా ప్రతిపాదనలో వున్నందున ఈ యేడాది ఆయనకు ఈ అవార్డును అందజేసి వచ్చే యేడాది నుండి అవార్డు ప్రదానోత్సవాన్ని నిలిపివేద్దామని కమిటీలోని కొంతమంది పెద్దలు సూచించడంతో ఈ అవార్డును ఈయేడాది జెయస్.రెడ్డికి ఇస్తున్నారు. అయితే ఇప్పటివరకు అన్ని అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రీమతి మాగుంట పార్వతమ్మను ఈసారి నిర్వాహకులు అసలు ఆహ్వానించకపోవడం కొసమెరుపు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## 'ప్రభా'తం

# శాంతి ప్రయత్నాలకు షాక్

సమస్యల పరిష్కారానికి చర్చలే అనువైనవని అందరూ అనుకుంటున్నవేళ.. 'హుర్రియత్' అంశాన్ని సాకుగా చూపి చర్చల నుంచి పాక్ వెనక్కి మళ్లడం సర్వత్రా చర్చనీయాంశంగా వుంది. చర్చల రద్దుకు ఏదో ఒకసాకు కోసం ఎదురుచూస్తున్న పాక్‌కు, భారత్ అభ్యంతరాలే సాకుగా దొరికినట్లున్నాయి. ఏదేమైనా చర్చలకు ఆదిలోనే ఇలా ఆడ్డంకి ఏర్పడడం విచారకరం. అయితే, ఇప్పుడే కాదు, మరెప్పటికైనా భారత్-పాక్‌ల మధ్య సుహృద్భావపూరిత చర్చలే సమస్యలకు పరిష్కారం. అందుకు ఇరుదేశాలూ సంయమనంతో, సుహృద్భావంతో వ్యవహరించి..చర్చల ద్వారా పురోగతిని సాధించడమే మార్గం.

భారత్-పాకిస్థాన్ సంబంధాలు మళ్ళీ మొదటికొచ్చాయా అనిపిస్తోంది. గత నెల 11వ తేదీన రష్యాలోని 'ఉఫా'లో బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ (ఎస్‌ఓసి) సమావేశాల సమయంలో ఇరుదేశాల ప్రధానులూ కలసి, సమస్యల పరిష్కారానికి సంప్రదింపులే సముచితమైన మార్గమని నిర్ణయించుకుని, ఆ మేరకు త్వరలో చర్చలు జరుపుతామంటూ ఉమ్మడి ప్రకటన కూడా విడుదల చేశారు. ఆ చర్చల తర్వాత బిఎస్‌ఎఫ్, పాక్ రేంజర్స్ మధ్యన, ఆ తర్వాత ఇరుదేశాల మిలిటరీ డైరెక్టర్ జనరల్స్ మధ్యనా సంప్రదింపులు జరుగుతాయని ప్రకటించారు. ఇంత స్పష్టంగా ఇరుదేశాల ఉమ్మడి ప్రకటన వచ్చాక, ఇక సంప్రదింపులకు సమయం ఆసన్నమైన వేళ.. ఒక్క భారత్, పాకిస్తానే కాదు, ప్రపంచమంతా ఆసక్తిగా ఈ చర్చల సారాంశం కోసం ఎదురుచూస్తున్న వేళ, ఇక మరికొద్ది గంటల్లోనే రెండు దేశాల జాతీయ భద్రతా సలహాదారుల మధ్య చర్చలు జరుగుతాయని అందరూ నిరీక్షిస్తున్న వేళ.. ఒక్కసారిగా చర్చలు రద్దు కావడం.. అందరినీ నిరాశకు గురిచేసింది. అదే ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా వుంది. అయినా, అసలు, ఉఫా ఉమ్మడి ప్రకటనలో మాటమాత్రమైనా ప్రస్తావనకు రాని కాశ్మీర్ అంశం, హుర్రియత్ సంస్థా ఈ చర్చలకు పెద్ద అవరోధంగా మారడమే అందరికీ ఆశ్చర్యం కలిగించే విషయం.

ఈ చర్చలకు ముందు తమ జాతీయ భద్రతా సలహాదారు హుర్రియత్ నేతలతో సంప్రదింపులు జరుపుతారని పాకిస్తాన్ పేర్కొనడం, అందుకు భారత్ అభ్యంతరం చెప్పడంతో కథ మళ్ళీ మొదటికొచ్చింది. చర్చలకు ఆదిలోనే అడ్డంకి ఏర్పడింది. ఈ చర్చలు రద్దుకావడం దురదృష్టకరమని కేంద్రమంత్రి రాజ్‌నాధ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఇరుదేశాల జాతీయ భద్రతా సలహాదారుల మధ్య జరగే చర్చల్లో మూడో పక్షం వారికి చోటు లేదని, చర్చలు జరగడానికి ముందుగానీ, మధ్యలోగానీ, ఆ తర్వాత గానీ ఇతరులు చర్చలు జరుపుతారనడంలో అర్థం లేదని ఆయన స్పష్టం చేశారు. అసలు ఉఫాలో భారత్ ప్రధాని నరేంద్రమోడీ, పాక్ ప్రధాని నవాజ్‌షరీఫ్ నిర్ణయించిన ఎజెండా నుంచి పాకిస్తాన్ పక్కదారి పట్టివుండాల్సింది కాదని ఆయన అంటున్నారు. పొరుగు దేశంతో చర్చలు జరపడానికి, సుహృద్భావ సంబంధాలకు భారత్ కట్టుబడి వుందని, అయితే ఆఖరి నిమిషంలో పాక్ చర్చలను రద్దుచేయడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. చర్చల్లో కాశ్మీర్ అంశమే ప్రధాన ఎజెండా అంటూ పాకిస్తాన్ పేర్కొనడంలో అర్థం లేదని, అదే కనుక ఎన్‌ఎస్‌ఏ స్థాయి చర్చల్లో భాగమైనప్పుడు ఆ విషయం ముందుగానే ఎందుకు నిర్ణయించబడలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. ముమ్మాటికీ కాశ్మీర్ అంశం ఎజెండాలో లేనేలేదని ఆయన తేల్చిచెప్పారు. కేవలం ఉగ్రవాదం విషయం మాత్రమే ఎజెండాలో నిర్ణయించబడిందని ఆయన పేర్కొన్నారు. జరగాల్సిన చర్చల పట్ల భారత్ వైఖరి ఇంత స్పష్టంగా వుండగా, పాక్ ద్వంద్వ వైఖరితోనే చర్చల నుంచి వెనక్కిమళ్ళిందని అందరికీ అర్థమవుతోంది.

అయితే, పాక్ మాత్రం ఆ అభాండాన్ని కూడా భారత్‌పైనే మోపేందుకు సిద్ధమైంది. న్యూఢిల్లీలో కాశ్మీరీ వేర్పాటువాదులతో సమావేశం కావద్దంటూ పాక్ జాతీయ భద్రతా సలహాదారుకు భారత్ ముందస్తు షరతులు విధించడం చర్చల రద్దుకు కారణమంటూ తన వాదన వినిపించుకుంటోంది. అదే నిజమైనట్లు అభూతకల్పనలు సృష్టిస్తోంది. ఉగ్రవాద విష సర్పానికి పాలుపోసి పెంచుతూ, భారత్‌కు వ్యతిరేకంగా మరో రూపంలో యుద్ధం సాగిస్తున్న ఉగ్రవాద గ్రూపులకు ఆయుధాలనూ, అండదండలనూ మెండుగా అందిస్తూ ఉగ్రవాదానికి ఊతమివ్వడం పాక్‌కు పరిపాటేనని అందరికీ తెలిసిందే. ఒకవైపు మాటలకు సిద్ధమంటూనే, మరోవైపు సరిహద్దుల్లో తూటాలు పేల్చడం పాక్ ఎప్పటినుంచో అనుసరిస్తున్న వ్యూహమే. అయినా, ఇరుదేశాల సమస్యలకు సంబంధించి మనమే మాట్లాడుకోవాలి తప్ప, మూడో వ్యక్తి ప్రమేయం వుండకూడదని గతంలోనే భారత్ స్పష్టం చేసి వున్న విషయాన్ని ఈ సందర్భంగా గమనించుకోవాలి. న్యూఢిల్లీలో పాక్ హైకమిషనర్ హుర్రియత్ నేతలతో సమావేశం కావడాన్ని వ్యతిరేకిస్తూ భారత్ గత ఆగస్టులో జరగాల్సిన విదేశాంగ కార్యదర్శుల స్థాయి చర్చలను కూడా రద్దు చేసుకున్న సందర్భం అందుకు నిదర్శనంగా వుంది. అయినప్పటికీ, పాక్ వైఖరిలో ఆశించిన మార్పేమీ లేదు. చర్చల రద్దుకు ఏదో ఒక సాకు కోసం ఎదురుచూస్తున్న పాక్‌కు, భారత్ అభ్యంతరాలే సాకుగా దొరికినట్లున్నాయి. 'హుర్రియత్' అంశాన్ని సాకుగా చూపి చర్యల నుంచి పాక్ వెనక్కి మళ్ళింది. ఏదేమైనా, ఇది నిజంగా ఎంతో దురదృష్టకరమైన పరిణామం.

అయితే, ఇప్పుడే కాదు, మరెప్పటికైనా భారత్-పాక్‌ల మధ్య సుహృద్భావపూరిత చర్చలే సమస్యలకు పరిష్కారమన్నది అందరికీ తెలిసిందే. చర్చలు జరిగితేనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది కనుక, ఆ సమయం కోసం ఎంతకాలమైనా సరే వేచివుండక తప్పదు.

అందులోనూ, వచ్చేఏడాది పాకిస్తాన్‌లో జరిగే సార్క్ సమావేశాలకు హాజరుకావాలని పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్, మన ప్రధాని నరేంద్రమోడీని ఆహ్వానించగా, అందుకు ప్రధాని నరేంద్రమోడీ అంగీకరించి వున్నారు. ఆ పర్యటన బహుశా సార్క్ చరిత్రలోనే ఒక అద్భుతమైన.. విశిష్టమైన ఘట్టంగా వుండవచ్చని కూడా అందరూ వూహిస్తున్న తరుణంలో, ఇప్పుడిలా ఎన్‌ఎస్‌ఏ చర్చలు చివరినిమిషంలో రద్దు కావడమే ఆందోళన కలిగించే అంశం.

ఇకనైనా ఇరుదేశాలు సంయమనంతో, సుహృద్భావ వాతావరణంలో.. స్నేహపూర్వకంగా అన్ని అంశాలూ చర్చించుకోవాలి. అందుకు చర్చల కొనసాగింపునకు సంసిద్ధం కావాలి. పేరుకున్న అడ్డంకులన్నిటినీ ఎలాగైనాసరే అధిగమించి, చర్చల పురోగతికి ఇరుదేశాలూ కలసి అడుగు ముందుకువేయాలి. అప్పుడే అన్ని సమస్యలకూ పరిష్కారం మార్గం కనపడుతుంది.

# ప్రత్యేకహోదాతోనే అభివృద్ధి



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జరగాలంటే ప్రత్యేక హోదా ఇవ్వాలని కావలి మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్య యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో "ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా" ఇవ్వాలి అనే అంశంపై కార్యక్రమం జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథులుగా ఆర్.వి.రాఘవనాయుడు, వొమ్మిన నాగసతీష్‌బాబు, పొన్నాల రామసుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. సభకు ముందు హైటెక్ మెజీషియన్ ఏ.కె.రాయల్ చేసిన ఇంద్రజాల ప్రదర్శన సభికులను ఆశ్చర్యచకితులను చేసింది. అనంతరం బాలాజీ ఆర్కెస్ట్రా వారి సంగీత విభావరిలో గాయనీగాయకులు దుర్గం మధుసూదన్, మనుబోలు ప్రభాకరరావు, బి.కరుణకుమార్, విరుగు సుబ్రహ్మణ్యం, ఎవియస్ శ్రావణి ఆలపించిన అలనాటి పాత, కొత్త పాటలు వీనులవిందుగా సాగాయి. ఈ సందర్భంగా సంస్థ తరఫున నెల్లూరు వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, మెజీషియన్ ఏ.కె.రాయల్‌ను శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షులు కేతా సుబ్బారావు నిర్వహించారు. పౌరాణిక కళాకారుడు వల్లకవి వేంకటసుబ్బారావు, బిరుదవోలు రామిరెడ్డి, కాళిదాసు పురుషోత్తం, ఆలూరు శిరోమణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

# పద్య కవితా సంపుటాలకు ఆహ్వానం

సుప్రసిద్ధ కవి డా॥ నాగభైరవ కోటేశ్వరరావు స్మారక కవితా పురస్కారం-2015కు నాగభైరవ అవార్డు కమిటి పద్యకావ్యాలు, పద్య కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి చిన్ని నారాయణరావు తెలిపారు. 2013 జనవరి నుండి 2015 ఆగస్టు 31వరకు ప్రచురింపబడిన పద్యకావ్యాలు, పద్య కవితా సంపుటాలు తెలుగు రాష్ట్రాల నుండి సంపుటాల ప్రతులు మూడింటిని 2015అక్టోబర్ 20లోగా చిన్ని నారాయణరావు, ప్రధాన కార్యదర్శి, డా॥ నాగభైరవ కోటేశ్వరరావు అవార్డు కమిటి, రూం నెం. 14, రెండవ అంతస్తు, కెఏసి ప్లాజా, ఆర్ఆర్ వీధి, నెల్లూరు చిరునామాకు పంపాలని కోరారు. ఎంపికైన ఉత్తమ రచనకు నవంబర్ నెల చివరి వారంలో జరిగే నాగభైరవ కవితా పురస్కార ప్రదానోత్సవ సభలో రూ.5వేలు నగదుతో పాటు ఘనసత్కారం జరుగుతుందన్నారు.




# ప్రకాశం ఆశయాలు సాధిద్దాం

ప్రకాశం పంతులు జయంతులు, వర్ధంతులు, పంతులు గారి విగ్రహాలకు, పటాలకు పుష్పాలంకరణలు చేయడం, జయ జయ నినాదాలు చేయడం జరుగుతుంది. నారా చంద్రబాబునాయుడు నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన తరువాత ప్రకాశం పంతులు జయంతి ప్రభుత్వ పండుగగా నిర్ణయించారు. ప్రాథమిక పాఠశాలల్లో పంతులు గారి జీవిత చరిత్ర పాఠ్యాంశంగా చేయుట, జిల్లాల్లోని ఉన్నత పాఠశాలల్లో పాఠశాల వారీగా విద్యార్థులకు పంతులు గారి మీద వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో సామూహికంగా తిరిగి పోటీలు జరపడం వలన యువతరంలో దేశం కొరకు పంతులు గారు చేసిన సేవలు గుర్తించుకొని వారి అడుగుజాడల్లో నడుచుకొనే అలవాటు కలుగుతుంది. పుష్ప మాలాంకృతులను చేయడం, నినాదాలు చేయడం వల్ల వారి ప్రతిభ బయటపడదు.

**రాళ్ళపల్లి రామసుబ్బారావు, నెల్లూరు.**

# బస్సును సక్రమంగా నడపండి

విడవలూరు మన్మధరావుపేట నుండి ఆర్టీసీ బస్టాండ్‌కు నడిచే నెల్లూరు 2 డిపో బస్సు టైమింగ్ సక్రమంగా ఉండడం లేదు. ఉదయం 8.50గంటలకు కదలాల్సిన బస్సు 9.20 గంటలకు కదులుతుంది. నెల్లూరుకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు బాగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని బస్సు డ్రైవర్లు గమనించాలి. టైమింగ్స్ మార్చుకోవాలి. ఈ బస్సును ఆలస్యంగా తీస్తుండడం వల్ల ఎక్కువ మంది ప్రయాణీకులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

**పి.ధనుష్, విడవలూరు.**

# అక్రమమైనింగ్

నెల్లూరుజిల్లాలో అక్రమ మైనింగ్ ఎక్కువవుతుంది. భూములు ఒకరి పేరు మీద వుంటే, మైనింగ్ లీజులు ఇంకొకరి పేరు మీద ఉంటున్నాయి. అధికార పార్టీ నాయకులు భూరికార్డులు మార్చి, పేర్లు మార్చి, అధికారులను లంచాలతో కొని అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. పొదలకూరు, వెంకటగిరి, గూడూరు, ఉదయగిరి, రాపూరు, సైదాపురం మండలాలలో తెలుగుదేశం నాయకులు దౌర్జన్యాలతో మైనింగ్ భూములను ఆక్రమించి ఉన్నారు. వైకాపా ఎమ్మెల్యేలు దీనిపై దృష్టి పెట్టాలి. అసెంబ్లీలో చర్చించాలి.

**వై.సుధాకర్‌గౌడ్, పొదలకూరు.**

# వై.వి. ఎంపిక శుభపరిణామం

జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పరిశీలకులుగా ఒంగోలు ఎంపి, పార్టీ సీనియర్ నాయకులు వై.వి.సుబ్బారెడ్డి నియమింపబడడం శుభపరిణామం. జగన్ తీసుకున్న నిర్ణయం హర్షణీయం. వై.వి.సుబ్బారెడ్డి, వై.యస్.జగన్ మేలు కోరే నాయకులు. పార్టీలో నిబద్ధతకు, నిజాయితీకి, అంకితభావానికి చిహ్నం. అటువంటి నాయకుని మార్గదర్శకత్వంలో జిల్లాలో పార్టీ పటిష్టమవుతుంది. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు.

**బి.ఆర్.శాలి, కావలి.**

# ఆధార్ ఆవశ్యం

మనిషికి గుండె ఎంత అవసరమో, భారతీయుడికి ఆధార్‌కార్డు కూడా అంతే అవసరం. అవినీతి ప్రక్షాళనకు ఇది అవసరం. దొంగ ఓట్లు నిర్మూలనకు ఆధార్ లింకు కావాలి. అన్నింటికి ఆధార్ లింకు చేయొద్దని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం దురదృష్టకరం. దొంగ సబ్సిడీలకు కత్తెర వేయడానికి 'ఆధార్' కావాలి. ఆధార్ అనుసంధానాన్ని అందరూ ఆమోదించాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# ఫర్వాలేదనిపించుకుంటున్న గౌతమ్

***జిల్లా రాజకీయాలలో మేకపాటి కుటుంబం మీద ఒక ముద్ర వుంది. గెలిచిన తర్వాత ప్రజలకు అందు బాటులో ఉండరని, సమస్యలపై పెద్దగా స్పందించరని.***



మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలతో పోలిస్తే వారి కుటుంబంలో మేకపాటి గౌతంరెడ్డే మంచి నాయకుడనిపించుకుంటున్నాడు.

2014ఎన్నికల్లో ఆత్మకూరు అసెంబ్లీ నుండి వైకాపా అభ్యర్థిగా దిగిన మేకపాటి గౌతంరెడ్డి మీద కూడా ఇదే ప్రచారం వచ్చింది. అవతల కాంగ్రెస్ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ప్రభావవంతంగా ఎలక్షన్‌ను ఎదుర్కొని వున్నా లేదా తెలుగుదేశం పార్టీ తరపున మెట్టుకూరు ధనుంజయరెడ్డి లాంటి గట్టి నాయకుడు పోటీ చేసున్నా గౌతం మీద ఆ ప్రభావం పనిచేసుండేది. అయితే ఆరోజు రామ నారాయణరెడ్డి ఎన్నికలను పట్టించుకోక పోవడం, తెలుగుదేశం అభ్యర్థి వీక్ కావడంతో గౌతం మీద ఈ ప్రభావం పడలేదు.

అయితే, ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక గౌతం తమ కుటుంబ సభ్యుల తరహాలో కాకుండా పూర్తి భిన్నంగా వ్యవహరిస్తూ ప్రజలకు దగ్గరగా వుండడంతో ఫరవాలేదనిపించుకుం టున్నాడు. గ్రామాల్లో తిరుగుతున్నాడు, సమస్యలపై స్పందిస్తున్నాడు. ఆత్మకూరు పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో సి.సి. కెమెరాలను తన సొంత డబ్బుల తోనే పెట్టించాడు. నేర నియంత్రణలో పోలీసులకు ఇవి బాగా ఉపయోగ పడుతున్నాయి. అసెంబ్లీలోనూ సమస్యలపై చర్చిస్తున్నాడు. అయితే అయిదేళ్లు ఆనం రామనారాయణరెడ్డి కాలంలో నిధుల ప్రవా హాన్ని చూసిన ఆత్మకూరు ప్రజలకు ఇప్పుడు అంతా శూన్యంగా ఉంది. ప్రతి పక్ష ఎమ్మెల్యేగా గౌతంకు ఆ లోటును పూడ్చడం అలవికాని పని. అధికార పార్టీ ఎమ్మెల్యేలే రూపాయి పనిచేయలేక చేతులెత్తేసి, కాళ్లు చాపి పడుకుని ఉన్నారు. కొంతలో కొంతన్నా తనకు చేతనైంది చేస్తూ గౌతం ఫర్వాలేదనిపించుకుంటున్నాడు.

# శ్రీసిటీలో ఐసీఏ బృందం




ఇండియన్ సెల్యులార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఫాస్ట్‌ట్రాక్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్‌టీటీఎఫ్) ఛైర్మెన్ పంకజ్ మహేంద్రూ నేతృత్వంలో ఐసీఏ బృందం, రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఎస్ రావత్, చిత్తూరుజిల్లా కలెక్టర్ సిద్ధార్థ్‌జైన్ 22వ తేదీ శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి వీరికి సాదర స్వాగతం పలికి సెజ్ మౌలిక వసతులు, అభివృద్ధిని వివరించారు.

అక్కడ నుంచి సెజ్ పరిసరాలను చుట్టిచూసిన వీరు అనంతరం ఫాక్స్‌కాన్ మొబైల్‌ఫోన్ల తయారీ పరిశ్రమను సందర్శించారు. అక్కడ తయారీ విధానం, ఉద్యోగుల భద్రత తదితర అంశాలను పరిశీలించారు. ఫాక్స్‌కాన్ డైరెక్టర్ జోష్, ఇతర సిబ్బందితో చర్చించిన వీరు పరిశ్రమ అభివృద్ధికి అన్ని విధాల సహకారమందిస్తామన్నారు. ఈ సందర్భంగా పంకజ్ మహేంద్రూ శ్రీసిటీలో పరిశ్రమల ఏర్పాటుకు అవ సరమైన విద్యుత్, రవాణా, ఇతర మౌలిక వసతులు కల్పించిన ఎండి రవీంద్ర సన్నా రెడ్డిని అభినందించారు.

రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఐసీఏ, ఎఫ్‌టిటిఎఫ్ కృషితో దేశంలోని ఎలక్ట్రానిక్, హార్డ్‌వేర్ మార్కెట్ మరింత పురోగతి సాధిస్తోందన్నారు. ఐసీఏ బృందం పర్యటన శ్రీసిటీ అభివృద్ధికి మరింత దోహదపడుతుందన్నారు.

# అభివృద్ధిలోకి రావాలంటే ప్రశ్నించేతత్వముండాలి



అభివృద్ధిలోకి రావాలంటే ప్రశ్నించే తత్వం ప్రతి విద్యార్థిలో ఉండాలని, అప్పుడే విద్యార్థి ఎన్నో విజయాలను సాధిస్తూ ముందుకు వెళ్లగలడని రీజినల్ జాయింట్ డైరెక్టర్ సి.ఎస్.పరంధామయ్య అన్నారు. ఈ నెల 23వ తేదీ నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగిన విశ్వసాయి విద్యాసంస్థల ప్రతిభాపురస్కార ప్రదానోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఒక ప్రత్యేక ప్రణాళికతో మంచి అధ్యాపకుల సారధ్యంలో జాతీయస్థాయి విజయాలను సాధిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పడుతూ అటు సమాజంలోను ఇటు తల్లిదండ్రులలోను మెప్పు పొందుతూ అన్నింటికి అతీతంగా వెలుగొందుతున్న కళాశాల విశ్వసాయేనని అభినందించారు. అబ్దుల్ కలాంగా ఎదగాలంటే సామర్థ్యం పెంచుకోవాలని విద్యార్థులను కోరారు. మరో ముఖ్యఅతిథి ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి జాకబ్ మాట్లాడుతూ సమస్యలేని కళాశాల విశ్వసాయి కళాశాల అని, విద్యాపరంగానే కాకుండా వసతుల ఏర్పాటు చేయడంలోను విశ్వసాయి కళాశాల రాష్ట్రంలోనే ముందుందన్నారు. ప్రతివిద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేకశ్రద్ధతో పాటు ఏ విషయాన్నైనా స్పష్టంగా చెప్పడం అలవర్చుకోవాలన్నారు. అతిథిగా విచ్చేసిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస రాజు మాట్లాడుతూ కష్టంతో కాదు ఇష్టంగా పనిచేస్తూ ఎక్కడా ఆగకుండా వెళితే 15 సంవత్సరాలలో ఒక మంచి డాక్టర్‌గా రాణిస్తారన్నారు. వైద్యవృత్తి చాలా పవిత్రమైన దని, ఏ ప్రొఫెషన్‌లో లేని గౌరవం డాక్టర్ వృత్తిలో ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో అరవిందబాబు, డాక్టర్ అమర్‌నాథ్, కళాశాల ఛైర్మెన్ డాక్టర్ యన్.సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ జి.కృష్ణమోహన్, వాకాటి విజయ కుమార్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# నెల్లూరు కబుర్లు

## బంద్‌కు సన్నాహాలు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కల్పించాలని కోరుతూ వైకాపా ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు జిల్లా నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో పూర్తిస్థాయిలో ఈ బంద్‌ను విజయవంతం చేయాలని వైకాపా నాయకులు పట్టుదలతో ఉన్నారు. గత కొన్నేళ్లుగా బంద్‌లు మొక్కుబడిగా తయారయ్యాయి. బంద్‌లకు పిలుపునిచ్చిన పార్టీలు, సంఘాల వాళ్లు కూడా బంద్‌రోజు రోడ్ల మీదకు రావడం లేదు. కాకపోతే బంద్ అనగానే విద్యాసంస్థలకు ముందుగా సెలవులు ప్రకటించడం, వ్యాపారసంస్థలు, ప్రైవేట్, ప్రభుత్వ విద్యాలయాలను ఆరోజు వరకు మూతేసుకోవడం ఒక పరిపాటిగా మారింది. ప్రత్యేకహోదా రాష్ట్రప్రగతికి, ప్రజాభవిష్యత్‌కు సంబంధించిన విషయం. బంద్‌కు ప్రజల మద్దతు కూడా ఉంటుంది. కాబట్టి 29వ తేదీ బంద్‌ను చిత్తశుద్ధితో చేపట్టి గతంలో ఏ బంద్ జరగని రీతిలో జరిపేందుకు వైకాపా నాయకులు సమాయత్తమవుతున్నారు.

## డిఎం అండ్ హెచ్‌ఓగా డి.వి.లక్ష్మి



జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణిగా అట్లూరి దేవకి వెంకట లక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖలో వైద్యశాఖ ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆమెను నెల్లూరుకు బదిలీ చేశారు. ఇక్కడ డిఎం అండ్ హెచ్‌ఓగా పనిచేస్తున్న భారతీరెడ్డిని విశాఖపట్నంలో వెంకటలక్ష్మి పనిచేస్తున్న పోస్టుకు బదిలీ చేసారు.

## స్వతంత్ర పార్కు అభివృద్ధికి చర్యలు



నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీబొమ్మ వద్ద గల స్వతంత్ర పార్కును రూ.60లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. సోమవారం తన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఎంయూఎఫ్ఐడిసి పథకం క్రింద పార్కు అభివృద్ధికి నిధులు వచ్చాయన్నారు. వచ్చేవారం నుంచి పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్‌శాఖ అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## మత్స్యశాఖ జేడీగా సీతారామరాజు

నెల్లూరుజిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా తూర్పు గోదావరి జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీతారామరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా జిల్లాలో పనిచేస్తున్న మత్స్యశాఖ అభివృద్ధి అధికారులను బదిలీ చేశారు. పడుగుపాడు ఎఫ్‌డిఓగా పనిచేస్తున్న చాంద్ బాషాను తడకు, గుంటూరు జిల్లా వినుకొండలో పనిచేస్తున్న జగ్గయ్యను పడుగుపాడుకు, బుచ్చిరెడ్డిపాళెంలో పనిచేస్తున్న ప్రసాద్‌ను కావలికి, కావలిలో పనిచేస్తున్న ప్రసాద్‌రావును గూడూరుకు, గూడూరులో పనిచేస్తున్న హరికిరణ్‌ను ఇందుకూరుపేటకు బదిలీ చేశారు.

## ఆకట్టుకున్న "సేవ్ ద టైగర్"



నెల్లూరు సరస్వతినగర్‌లోని డా॥ కిషోర్స్ రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ చిన్నారులచే ఈ నెల 24వ తేదీ పాఠశాలలో నిర్వహించిన 'సేవ్ ద టైగర్' కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. జాతీయ జంతువైన టైగర్ యొక్క వివిధ నమూనాలను, అవి ప్రవర్తించే తీరును గురించి అత్యద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్ట్స్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామమూర్తినాయుడు మాట్లాడుతూ రాను రాను పులుల జాతి అంతరించిపోతుందని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. దీనికి ముఖ్య కారణమైన అడవుల నరికివేతను ఆపాలని సూచించారు. పులులను బోనుల్లో, గొలుసులతో బంధించడం వల్ల అవి స్వేచ్ఛా వాతావరణాన్ని కోల్పోతాయని, స్వేచ్ఛగా తిరిగేలా వివిధ నమూనాలతో ప్రదర్శించిన తీరు అద్భుతంగా వుందన్నారు. చిన్నారులు ఇలాంటి ప్రదర్శనల్లో పాల్గొనడం వల్ల వారికి చక్కని అవగాహన కలుగుతుందన్నారు. సేవ్ ద టైగర్ ప్రోగ్రామ్‌ను చిన్నారులకు అర్థమయ్యేలా ప్రదర్శించి వాటి చేష్టలను వివరించిన ప్రిన్సిపల్, అధ్యాపకబృందాన్ని అభినందించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మి, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ఏఓ సునీల్ కుమార్, చిన్నారుల తల్లిదండ్రులు, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

## సిపిఓగా గురుమూర్తి



జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిగా టి.గురుమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన చిత్తూరు, ప్రకాశం జిల్లాల సిపిఓగా పనిచేశారు. తర్వాత మెదక్‌లోనూ పని చేశారు.

## నెల్లూరుజిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శిగా నారాయణరాజు

నెల్లూరుజిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా నారాయణరాజు నియమితులయ్యారు. కోవూరు జెబిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)గా విధులు నిర్వహిస్తున్న నారాయణరాజును జిల్లా విద్యాశాఖాధికారి ఆంజనేయులు ఎంపిక చేసి ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరాజు మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలల నిర్వహణకు తనవంతు కృషి చేస్తానని, జిల్లాలోని వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, క్రీడా సంఘాల సమన్వయం, సహకారంతో క్రీడాభివృద్ధికి పాటు పడతానన్నారు.

## ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శిగా జయప్రకాష్



ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపియుడబ్ల్యూజే) 34వ రాష్ట్ర సభలు ఈ నెల 24, 25తేదీలలో గుంటూరుజిల్లా వడ్డేశ్వరం కె.యల్.యూనివర్శిటీలో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో నెల్లూరుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఏ.జయప్రకాష్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గతంలో ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, నెల్లూరుజిల్లా అధ్యక్షుడిగా, రెండుసార్లు ప్రధానకార్యదర్శిగా పని చేశారు.

## మైనార్టీ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనార్టీ వెల్ఫేర్ ఉర్దు అకాడమీ ఆధ్వర్యంలో అర్హులైన మైనార్టీ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ తెలిపారు. సెప్టెంబర్ నెల 3వ తేదీ లోగా దరఖాస్తులు స్వీకరిస్తామని, అభ్యర్థులు 10వ తరగతి పాసై, 35సంవత్సరాలలోపు ఉండాలని తెలిపారు. కోర్సుల్లో అడ్వాన్స్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, మల్టిపుల్ డెస్క్‌టాప్ పబ్లిషర్స్, ట్యాలీ వుంటాయన్నారు. ఇతర వివరాలకు 99667 40353 నెంబరులో సంప్రదించాలన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గం

ఏపి ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి, జయరామరాజు, కార్యదర్శులు, కోశాధికారులను ఎన్నుకున్నారు.

## ఆర్ఎస్ఆర్ స్కూల్‌కు ద్వారకా మైక్‌సెట్



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ హైస్కూల్‌కు నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ మైక్‌సెట్, స్పీకర్స్, యాంప్లిఫయర్స్‌ను ఉచితంగా అందజేశారు. కొద్దిరోజుల క్రితం ఆయన ఇదే స్కూల్‌లో 500మంది పిల్లలకు యూనిఫామ్స్, పుస్తకాలు అందజేశారు. ఈ స్కూల్‌కు ఇంకా అవసరమైన సౌకర్యాలు సమకూర్చడానికి తాను సిద్ధంగా వున్నానని ఈ సందర్భంగా ద్వారకా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజా సుబ్బరాయుడు, వీరబ్రహ్మం, వెంకటేశ్వర్లు, తంబి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ షాపుల వేలంపై స్టే

నెల్లూరు నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో వున్న 65షాపులకు వేలంపాట నిర్వహించాలని నగరపాలక సంస్థ అధికారులు చేసిన ప్రయత్నాలకు బ్రేక్ పడింది. షాపుల వేలంపై కోర్టు స్టే ఇచ్చింది. దీంతో వేలం పాటలు నిలిచిపోయాయి. లోకాయుక్త ఆదేశాల మేరకు 25ఏళ్ల లీజు గడువు దాటిన షాపులకు వేలంపాటలు పెట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి నిర్ణయించారు. ఈమేరకు లీజుదారులకు నోటీసులు కూడా జారీ చేసారు. ఈ నెల 25, 28, 31తేదీలలో వేలం పాటలు పెట్టాలని నిర్ణయించి పత్రికలలో ప్రకటనలిచ్చారు. అయితే కొందరు లీజుదారులు కోర్టును ఆశ్రయించారు. ఈ షాపులనే నమ్ముకుని పాతికేళ్లుగా బతుకుతున్నామని, వీటిని కోల్పోతే తమ బ్రతుకులు రోడ్డున పడతాయంటూ కోర్టుకు విన్నవించారు. వీరి ఆవేదనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు ముందుగా వేలంపాటల మీద స్టే ఇచ్చింది. దీంతో వేలంపాటలు నిలిచిపోయాయి.

## పాతూరికి అభ్యుదయ కవితా పురస్కారం



మచిలీపట్నంలో ఈ నెల 22, 23తేదీలలో భావ తరంగిణి మాస పత్రిక 17వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా రచయితల సంఘం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణను ప్రముఖ రచయిత్రిగా గౌరవించి "అభ్యుదయ కవితా పురస్కారం"తో పత్రికా సంపాదకులు భవిష్య, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, రుద్రరాజు ఫౌండేషన్ అధ్యక్షులు తదితర ప్రముఖులు సన్మానించి పురస్కారం ప్రదానం చేశారు.

## డికెడబ్ల్యూ కాలేజీలో 'స్వచ్ఛ భారత్'

నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాలలో ఆదివారం కళాశాల విద్యార్థినులు 'స్వచ్ఛభారత్' కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను ఏరివేసి, చెత్తనంతా తీసివేసి ప్రాంగణాన్నంతా పరిశుభ్రం చేశారు. కళాశాల విద్యార్థినులంతా ఎంతో ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'స్వచ్ఛభారత్' స్ఫూర్తితో తమ కళాశాలను తాము పరిశుభ్రంగా వుంచుకోవడానికి ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించేందుకు సంకల్పించినట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. ఇదేవిధంగా, జిల్లాలోని అన్ని కళాశాలలవారు, పాఠశాలల వారు వారానికో రోజు ఇలా పరిశుభ్రతకు, మొక్కలు పెంచడానికి, పచ్చదనం పరిరక్షించుకోవడానికి కేటాయిస్తే ఎంత బావుంటుందో!.. ఆయా పాఠశాలలు, కళాశాలల నిర్వాహకులు ఈ కార్యక్రమానికి సారథ్యం వహిస్తూ, ఆ మేరకు విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించాల్సి వుంది. అయినా, విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛంధంగా రంగంలోకి దిగాలే గానీ, పచ్చదనం–పరిశుభ్రత దానికదే దిగి రాకుండా ఎలా వుంటుందీ?!...

## అలరించిన సాహిత్య ఆధ్యాత్మిక ఉపన్యాసాలు

నెల్లూరు బాలాజీనగర్‌లోని బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23తేదీలలో సాహిత్య ఆధ్యాత్మిక ఉపన్యాసాలు జరిగాయి. 22వ తేదీ శ్రీమద్భగవద్గీతా విర్భావము పై తిక్కన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి అవనిగడ్డ వేంకటకృష్ణమూర్తి ఉపన్యశించారు. 23వ తేదీ శ్రీపతంజలి యోగాధ్యాయాలపై జ్యోతిషవిశారద అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం ఉపన్యసించారు. న్యాయశాఖ పరమైన న్యాయమార్గదర్శిని, న్యాయస్థానాల్లో డిక్రీల అమలుకు నమూనాలు, సూచనలు మాతృభాషలో వ్రాసినందుకుగాను అన్నవరం సత్యనారాయణరావును సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో అధ్యక్షులు శనగవరపు సత్యనారాయణమూర్తి, కోశాధికారి కుమ్మరగుంట వేంకటమోహన్, జిల్లా బ్రాహ్మణసంఘ అధ్యక్షులు గుడ్లదొన వాసుదేవరావు, కార్యదర్శి ఇస్కపల్లి కామేశ్వరప్రసాద్, గౌరవసలహాదారు స్వయంపాకుల శ్రీనివాసులు, కార్యదర్శి మావిళ్లపల్లి కాంతారావు, సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# అధునాతనంగా కొత్త కలెక్టరేట్

నెల్లూరులోని క్షయ ఆసుపత్రి ప్రాంగణంలోని విశాలమైన స్థలంలో కలెక్టరేట్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనలకు కార్యరూపం వస్తోంది. నగరం బాగా విస్తరిస్తున్న నేపథ్యంలో, ప్రజలందరికీ అందుబాటులో వుండేవిధంగా, అన్ని శాఖలను ఇక్కడకు చేర్చి, అధునాతనమైన రీతిలో ఇక్కడ కలెక్టరేట్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు సమీక్షలు జరిపి అధికారుల అభిప్రాయాలను కూడా ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 23న జడ్పీ సమావేశమందిరంలో ఆ మేరకు జిల్లా కలెక్టర్ శ్రీమతి జానకి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణానికి



అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రభుత్వం 35 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, రెండు గ్రౌండ్ ఫ్లోర్‌లతో పాటు, రెండంతస్తులు నిర్మాణం చేసేలా చర్యలు తీసుకొంటున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ట్రెజరీ, మీ-సేవ, పోస్టాఫీసు, ఇంటర్నెట్ కేంద్రం, పిహెచ్‌సి, సంక్షేమ శాఖలు, ఎస్సీ-బీసీ కార్పొరేషన్లు, యువజన సంక్షేమం, సమాచార శాఖ, స్త్రీ-శిశు సంక్షేమశాఖ, మైనార్టీ సంక్షేమశాఖ, సిపిఒ, దేవాదాయశాఖ కార్యాలయాలు వచ్చేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అదేవిధంగా, మొదటి అంతస్తులో కలెక్టరేట్; మూడు సమావేశ మందిరాలు, పౌరసరఫరాలు, డిఆర్‌డిఏ, ఎన్‌ఐసి, స్టోర్‌రూమ్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామన్నారు. మూడవ అంతస్తులో ఎసిఎంఐపి, భూగర్భజల శాఖ, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, ఆత్మ పి.డి కార్యాలయం, రికార్డు రూమ్ తదితర కార్యాలయాలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. వీటిపై ఆయా శాఖల అధికారులు అభిప్రాయాలు తెలపాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ కాంప్లెక్స్‌ను గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ ప్రకారం నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా, చెన్నైకి చెందిన కన్సల్టెంట్‌లు ఈ భవన నిర్మాణం గురించి అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో జేసీ ఇంతియాజ్, ఏజెసి రాజ్‌కుమార్, డిఆర్‌ఓ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్మశాన వాటికలు... పవిత్ర వేదికలు

నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని చింతారెడ్డి పాళెం గ్రామంలో హిందూ, క్రైస్తవ శ్మశాన వాటిక ఆధునీకరణకు స్నేహితుల సహకారంతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. శ్మశాన వాటికలో కర్మ కృతువులు, ఇతర ప్రార్థనలకు ప్రత్యేక షెల్టర్‌కు 24వ తేదీ శంకుస్థాపన చేసిన కోటంరెడ్డి, 30రోజులలో దీనిని పూర్తి చేసి స్థానిక ప్రజల అవసరాలకు ఉపయోగిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



శ్మశాన వాటికలు అత్యంత పవిత్రమైన స్థలాలని, జన్మనిచ్చిన మన పెద్దలు శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్న ప్రాంతమని, రేపటిరోజు మనమందరం శాశ్వత విశ్రాంతి తీసుకోవాల్సిన ప్రాంతమని, అలాంటి ప్రాముఖ్యత కలిగిన పవిత్ర శ్మశాన వాటికల పరిరక్షణకు చేతులు కలిపి కనీస వసతుల కల్పనకు ముందుకు రావాలన్నారు. నెల్లూరురూరల్‌లో ప్రజల భాగస్వామ్యంతో తాను చేపట్టిన శ్మశానవాటికల అభివృద్ధిని చూసి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ నిధులతో రాష్ట్రం అంతటా చేపట్టాలని ఆలోచన చేయడం మంచి పరిణామం అని, ఇది ఆలోచనకే పరిమితం కాకుండా అతి త్వరగా కార్యరూపం దాల్చాలని ఇందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మనుబోలు సికిందర్‌రెడ్డి, బాబు, రమణయ్య, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కృప, రమణమ్మ, లక్ష్మయ్య, శీను తదితరులు పాల్గొన్నారు.



# పింఛన్‌లలో పక్షపాతం

ఏ ఆధారములేని వారికిచ్చే పింఛన్‌ల విషయంలోనూ ఈ ప్రభుత్వం పక్షపాతంతో వ్యవహరిస్తుందని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ధ్వజమెత్తారు. అర్హులైన వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు వెంటనే పింఛన్‌లు మంజూరు చేయాలని కోరుతూ 25వ తేదీ నెల్లూరు కలెక్టరేట్ ఎదుట అనిల్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాలో అనిల్ మాట్లాడుతూ దివంగత మహానేత వై.యస్. వున్నప్పుడు జిల్లాలో 26వేల మందికి పింఛన్‌లు వచ్చేవని, ఇప్పుడు 6వేలు కుదించి 20వేల మందికి పింఛన్‌లు ఇస్తున్నారని, ఈ పదేళ్లలో పింఛన్‌ల అర్హులు పెరగకుండా తగ్గిపోయారా అని ప్రశ్నించారు. ఆధార్‌కార్డును అడ్డం పెట్టుకుని ఈ దుర్మార్గపు ప్రభుత్వం 80ఏళ్ల అవ్వలకు కూడా పింఛన్లు ఎగ్గొట్టిందని విమర్శించారు. నగరంలో ఏ ప్రాంతానికి పోయినా అర్హులైన వికలాంగులు, వితంతువులు, వృద్ధులు పింఛన్‌లు రాక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పక్క జల్సాలకు, టూర్లకు కోట్లు తగలేస్తున్న చంద్రబాబుకు అర్హులైన పేదోళ్లకు పింఛన్‌లు ఇవ్వడానికి మనసురాకపోవడం ఈ ప్రభుత్వ పైశాచికానికి నిదర్శనమన్నారు. జిల్లాలో మంత్రి నారాయణ వుంటే ఎప్పుడు జిల్లాకు వస్తాడో, పోతాడో తెలియదని, కనీసం ప్రజల్లో తిరిగే మంత్రినైనా ఈ జిల్లాకు ఇవ్వాలని అనిల్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, గోగుల నాగరాజు, ఎం.డి ఖలీల్ అహ్మద్, దేవరకొండ అశోక్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రతుకులను బస్టాండ్ పాల్జేస్తున్నారు

**- ఆనం రంగమయూర్**

నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ తన అనుచరులకు మున్సిపల్ షాపులను కట్టబెట్టేందుకు పాతికేళ్లుగా వాటినే నమ్ముకున్నవారి బ్రతుకులను బస్టాండ్ పాలు చేసేందుకు కుట్ర



పన్నుతున్నాడని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి విమర్శించారు. ఇందుకోసమే షాపుల వేలంపాటలు తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. సోమవారం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మేయర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, పాతికేళ్లుగా ఆ షాపులనే నమ్ముకుని బ్రతుకుతున్న వాళ్లను ఒక్కసారిగా ఖాళీ చేసి పొమ్మంటే ఎక్కడికిపోతారని ఆయన ఆ వినతిపత్రంలో ప్రశ్నించారు. మేయర్ తనతో కలిసి పార్టీ మారిన కార్పొరేటర్ల డివిజన్‌లలోనే పనులు చేస్తూ మిగిలిన డివిజన్‌లను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 30లక్షలు దాటిన పనులను స్టాండింగ్ కమిటీలో పెట్టి ఆమోదం తీసుకోవాల్సి వుండగా, అలాంటిదేమీ లేకుండానే పనులు ప్రారంభించడమేంటని ఆయన ప్రశ్నించారు.

# ఎన్ని జన్మలెత్తినా తెలుగోడిగానే పుట్టాలి

**- కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి**

ఎన్ని జన్మలెత్తినా మరలా తెలుగోడిగానే పుట్టాలని కోరుకుంటానని తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు, సినీ నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి తన మనోభావాన్ని వెల్లడించారు. దక్షిణ భారత తెలుగు సంక్షేమ సంఘం, టామ్స్ తమిళనాడు తెలుగు సంఘాలకు చెందిన వివిధ నాయకుల ఆధ్వర్యంలో 22వ తేదీ చెన్నై నగరంలోని మహాబలిపురం, ఇసిఆర్ రోడ్డులోని జాయ్‌బీచ్ ఆడిటోరియంలో అమెరికాకు చెందిన కింగ్స్ విశ్వవిద్యాలయం వారు జగదీశ్వర్‌రెడ్డి చేసిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని తమిళనాడులోని తెలుగు సంఘాల నాయకులు జగదీశ్వర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. తొలుత జగదీశ్వర్‌రెడ్డి జీవితంలో సాధించిన విజయాలను వీడియో ప్రదర్శన చేసారు. తనకు జరిగిన సన్మానానికి జగదీశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా





డుతూ ఇదేవిధంగా తెలుగు ప్రజలకు సేవచేసే భాగ్యం తనకు కలగాలని, ఎక్కడో వున్న అమెరికా విశ్వవిద్యాలయం వారు తనకు డాక్టరేట్ పట్టాను బహుకరించేందుకు కారణం తెలుగు ప్రజలేనని, తనకు అమెరికా వారిచ్చే గౌరవడాక్టరేట్ కంటే మీరు నాపై చూపించే ప్రేమ, ఆదరాభిమానాలే ఆజన్మాంతం గుర్తుంటాయన్నారు. తమిళ నాడు తెలుగు ప్రజల సమస్యలను తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం శూన్యమని, ఇందుకు నిరసనగా త్వరలో హైదరాబాదు ఇందిరాపార్కు వద్ద ఒక్కరోజు ధర్నా చేయనున్నట్లు, ఈ ధర్నాకు ఆంధ్రరాష్ట్రంలో వున్న అన్ని రాజకీయపార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను ఆహ్వానించనున్నట్లు కేతిరెడ్డి తెలిపారు.

# 'ఆనం'దంగా జయ జన్మదిన వేడుక

తెలుగుదేశం నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 25వ తేదీ అభిమానులు నెల్లూరు, సుజాతనగర్‌కాలనీలోని ఆయన ఇంటికి



భారీగా వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. స్నేహితులు, అభిమానులు, కుటుంబసభ్యుల సమక్షంలో ఆయన బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. అలాగే ఆయన అభిమానులు సాయిబాబా మందిరం, బారాషహీద్ దర్గాలలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ప్రగతి ఛారిటీస్‌లోని మానసిక వికలాంగ చిన్నారులకు, వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అంధుల పాఠశాలలో పిల్లలకు, పెద్దాసుపత్రిలో రోగులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లునాయుడు, జి.విజయకుమార్, చిన్నా, వెంకటేశ్వరయాదవ్, ఖాన్, బాబు, షఫి, సుబానీ, మహ్మద్, శ్రీనివాసులురెడ్డి, కోటి, శివ తదితరులు పాల్గొన్నారు.



# జడ్పీలో ప్రకాశం పంతులు జయంతి

ఈ నెల 23న నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు సందర్భంగా జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జిల్లా ప్రజాపరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజాపరిషత్ సిబ్బంది అందరూ హాజరయ్యారు.



# హృద్రోగులకు నియంత్రిత ప్యాకేజీ

గుండెజబ్బు బారిన పడినవారి కోసం ఒక నియంత్రిత ప్యాకేజీని న్యూరాలజీ డిపార్ట్‌మెంట్‌లో ప్రారంభించినట్లు నెల్లూరు అపోలో హాస్పిటల్ న్యూరాలజీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ బిందుమీనన్ తెలిపారు. ఈ నెల 23న ఆసుపత్రిలో 'స్ట్రోక్ అప్‌డేట్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఈ డిపార్ట్‌మెంట్‌లో తీవ్రమైన గుండె జబ్బుకు చికిత్స అందించడమేకాక చికిత్స తదనంతరం కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుండెజబ్బులకు కారణాలు, ప్రమాద పరిణామాలను ఆమె సుధీర్ఘంగా వివరించారు.

# భ్రూణ హత్యలు నిరోధించాలి



భ్రూణ హత్యలు నిరోధించి బాలికల నిష్పత్తిని పెంచాల్సిన అవసరముందని, అందుకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో "భేటీ బచావో - భేటి పడావో" జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలికలకు భరోసాను ఇచ్చే సుకన్య సమృద్ధి యోజనా పథకాన్ని గ్రామస్థాయిలో ప్రజలను చైతన్య పరచి విజయవంతం చేయాలన్నారు. మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న ర్యాగింగ్, వేధింపులు, అత్యాచారాలపై బీజేపీ కార్యకర్తలు ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, మిడతల రమేష్, కందుకూరి సత్యనారాయణ, భరత్‌కుమార్, అబ్దుల్ రహీం, వరదయ్య, దయాకర్‌రెడ్డి, కోటేశ్వరమ్మ, బుజ్జమ్మ, మాధవి, మారుతీరెడ్డి, అన్నం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు పూర్ణిమకు సన్మానం



శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటీలో న్యాయశాస్త్రంలో బంగారు పతకం సాధించిన నెల్లూరు నగరానికి చెందిన న్యాయవాది పి.సి.కృష్ణయ్య కుమార్తె పెళ్లకూరు పూర్ణిమాదేవిని నెల్లూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్‌లో సోమవారం న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి మెమెంటో బహుకరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మునుకూరు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి నావూరు శ్రీధర్, మాజీ బార్ కార్యదర్శులు ఆర్.రోజారెడ్డి, ఇ.వి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# సమస్యలు పరిష్కరించండి



సబ్‌కలెక్టర్ గిరీషాకు అర్జీలు సమర్పిస్తున్న గూడూరు డివిజన్ ప్రజలు

ఎన్నో ఏళ్లుగా సమస్యలు పరిష్కరించాలని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నేటికీ పరిష్కరించకపోవడంతో అవస్థలు పడుతున్నామని సబ్‌కలెక్టర్ గిరీషాకు అర్జీదారులు విన్నవించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అర్జీదారులు తమ సమస్యలను విన్నవించి న్యాయం చేయాలని వేడుకున్నారు. వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం, చిల్లకూరు, కోట తదితర ప్రాంతాలకు చెందిన అర్జీదారులు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. వచ్చిన సమస్యలను ఆయా తహశీల్దార్లు పరిశీలించి న్యాయం చేసేలా చూస్తానని సబ్‌కలెక్టర్ గిరీషా స్పష్టం చేశారు.

# ఐక్య కార్యాచరణ పోరాట సమితి దీక్షలు



దీక్షకు తమ మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు డివిజన్‌లోని కోట మండలంలో ఏర్పాటు చేస్తున్న తోళ్ల పరిశ్రమను రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ పోరాట సమితి ఆధ్వర్యంలో గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణం ముందు గత కొన్నిరోజులుగా చేస్తున్న రిలే నిరాహారదీక్షలకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, అయితే తోళ్ల పరిశ్రమ నిర్మిస్తే ప్రజలకు వ్యాధులు వస్తాయని, ఎంతో నష్టమని, అందుకే తాము తోళ్ల పరిశ్రమను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యకార్యచరణ పోరాట సమితి అధ్యక్షులు ఎల్.వి.సుబ్బయ్య, కార్యదర్శి డి.శేషయ్యగౌడ్, వైకాపా నాయకులు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుబజార్‌లో ఉల్లి విక్రయాలు



గూడూరు రైతు బజార్‌లో ప్రభుత్వం తక్కువ ధరకు ఉల్లిని విక్రయిస్తోందని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన కోరారు. ఆదివారం ఆమె స్థానిక రైతుబజారులో ఉల్లి విక్రయకేంద్రాన్ని పరిశీలించారు. రేషన్ కార్డు దారులకే పంపిణీ చేయాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా విక్రయాలు జరుపుతున్నారని తనకు పలువురు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారని, అలా జరగకుండా చూడాలని సూచించారు. ఉల్లి ధర ఆకాశానికి పెరిగిపోయిందని, దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పేదల కోసం రైతుబజారులో కేజీ ఉల్లిని రూ.20కే అందజేస్తోందన్నారు. అనంతరం వ్యాపారులు వారి సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

# తెలుగుజాతి వెలుగు ఆంధ్రకేసరి



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన
ప్రక్కన బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వై.చలపతిరావు

గూడూరులోని గడియారపు స్థంభం వద్ద ఆదివారం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 143వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ తెలుగుజాతి ప్రజలకు వెలుగు కాగడాగా నిలిచిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులన్నారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. స్వాతంత్ర్యం కోసం ఎంతో కృషి చేసిన వ్యక్తని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు ఎస్.నాగరాజారావు, సభ్యులు శ్రీనివాస్, కౌన్సిలర్లు కోడిపర్తి కల్పన, షంషీర్ తదితరులు పాల్గొన్నారు. కాగా గూడూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు ఇస్మాయిల్, ఉపాధ్యాయులు వెంకటయ్య, వివి కుమార్, శ్రీనయ్య, రమేష్ బాబు, శ్రీధర్‌రాజు, సంధాని, శ్రీనివాసులు, సిద్ధిక్, అహ్మద్, కృష్ణంరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ సవరణల మార్పుకే

# మీ ఇంటికి మీ భూమి



అర్జీలు స్వీకరిస్తున్న గూడూరు తహశీల్దార్ వెంకటనారాయణమ్మ

పల్లెల్లోని భూ వివాదాలు, ఎంతోకాలంగా పెండింగ్‌లో వున్న భూ సవరణల మార్పునకే 'మీ ఇంటికి మీ భూమి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా గూడూరు తహశీల్దార్ వెంకటనారాయణమ్మ తెలిపారు. మండలంలోని కొండాగుంట గ్రామంలో సోమవారం 'మీ ఇంటికి మీ భూమి' గ్రామసభను రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామంలో ఉన్న భూముల వివాదాన్ని పరిష్కరించాలని, అడంగల్, 1-బీ పత్రాలను సరిచేయాలని సుమారు 80అర్జీలను అధికారులకు సమర్పించి పరిష్కరించాలని విన్నవించారు. గ్రామంలో కొంతకాలంగా భూ వివాదం ఉండటంతో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామీణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ జగన్‌మోహన్‌రావు, ఆర్ఐ అశోక్‌వర్ధన్, వీఆర్వోలు చంద్రశేఖర్, శివకుమార్, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 15వ తేదీ నెల్లూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన
69వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి నారాయణ నుండి ఉత్తమ
సేవాపత్రాన్ని అందుకుంటున్న రాపూరు హెడ్‌కానిస్టేబుల్ ఆర్.వెంకటేశ్వరరాజు



# రాశి - మీ వాసి

బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 28.08.2015 నుండి
తేది. 03.09.2015 వరకు

ఈ వారం మీనంలో కుజుడు, కర్కాటకంలో కుజశుక్రులు, సింహంలో రవిగురువులు, కన్యలో బుధరాహువులు, వృశ్చికంలో శని, మకర కుంభ మీన మేషరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 28 శుక్రవారము వరలక్ష్మి వ్రతము
తేది 29 శనివారము శ్రావణపూర్ణిమ జంధ్యాల పండుగ. రాఖీ పండుగ. గురుమౌఢ్యమి జరుగుచున్నది. ముహూర్తములు లేవు.

**శ్రావణ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 28 | శుక్ర | చతుర్దశి | రా॥ గం.3.07వ॥ |
| తేది. 29 | శని | పూర్ణిమ | రా॥ గం.1.00వ॥ |
| తేది. 30 | ఆది | పాడ్యమి | రా॥ గం.10.08వ॥ |
| తేది. 31 | సోమ | విదియ | రా॥ గం.8.12వ॥ |
| తేది. 01 | మంగళ | తదియ | సా॥ గం.5.45వ॥ |
| తేది. 02 | బుధ | చతుర్థి | సా॥ గం.3.20వ॥ |
| తేది. 03 | గురు | పంచమి | ప॥ గం.1.05వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

చేపట్టిన పనులు టెన్షన్ పెట్టి అనుకూలంగా నెరవేరగలవు. బంధుమిత్రులను కలుసుకొంటారు. వృత్తి వ్యాపారాల అభివృద్ధికై గట్టి కృషి చేస్తారు. ఆదాయం పెరుగుతుంది. కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు సర్దుబాటు కాగలవు. ఉద్యోగులకు స్థానమార్పులు, అధికారుల సహకారం బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత కలదు. అనుకోని ఆదాయం కలదు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. ఆర్థికావకాశాలు కలసిరాగలవు. దూరప్రాంత పర్యటనలకు ఆహ్వానాలు లభించడం, శుభకార్యములు నిర్ణయము కావడం జరుగుతుంది. అనుకున్న వ్యక్తులు మీకు సహాయపడతారు. విద్యాప్రగతి బాగుంటుంది. చేపట్టిన పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. స్థిరాస్తులు పెట్టుబడులపై లాభాలుంటాయి. ఆత్మీయుల నుండి శుభవార్తలు వింటారు. ఈ వారం అదనంగా ఖర్చులుండినా ఆర్థిక ఇబ్బందులుండవు. ఉద్యోగులకు స్థాన మార్పులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆకర్షణీయ పథకాలతో ముందుకు సాగుతారు. ఉద్యోగులకు అవకాశాలు దొరికే అవకాశమున్నది. విద్యార్థులకు మంచి ప్రగతి కలదు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి పరంగా ప్రోత్సాహముండి సంతృప్తి చెందుతారు. అనుకున్న పనులు మీరెంత తొందరపెట్టినా నిదానంగా జరుగుతాయి. శుభకార్యములు నిర్ణయం కాగలవు. కొత్త పెట్టుబడులకు వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు రాగలవు. వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఉద్యోగులు ప్రలోభాలకు లోను కావద్దు. కుటుంబ సౌఖ్యము కలదు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగులు తమ పైఅధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. క్రయవిక్రయాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అనుకున్న పనులను లౌక్యంగా జరుపుకొంటారు. పనులందు శారీరక మానసిక శ్రమ ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, ఋణాల మంజూరు ఆలస్యం కాగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

నిర్మాణ పనులందు వర్కర్లతో సమస్యలుండగలవు. ముఖ్య బంధువుల నుండి అనారోగ్య వార్తలు వింటారు. వృత్తి వ్యాపారాల వృద్ధి ఆశించినంతగా ఉండదు. ఆదాయం తగ్గడం, ఖర్చులు పెరగడం ఉంటుంది. అవసరాలకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు. అనవసర వ్యవహారాలు, పనులందు పాల్గొనకుండా జాగ్రత్త పడండి. చేపట్టిన పనులందు టెన్షన్ ఉంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు ఏర్పడడం, అధికారుల, ప్రజల వత్తిడి పెరగడం జరుగుతుంది. ఆర్థిక ఇబ్బందుల నుండి క్రమంగా బయటపడతారు. కొత్త ప్రణాళికలతో వ్యాపారాలను నడిపిస్తారు. రాబడి స్వల్పంగా పెరుగుతుంది. ఏ నిర్ణయాలలోనైనా అనుభవ పరుల సలహాలు తీసుకొని చేయవలసి ఉంటుంది. గృహోపకరణాలు, ఆధునిక యంత్రాలను కొంటారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

మీ పలుకుబడి, మీ వ్యాపకాలు పెరుగుతాయి. స్థిరాస్తులు సమకూర్చుకొనే ప్రయత్నాలు జరుగుతాయి. చేపట్టిన పనులకు చిన్న ఆటంకాలు రావడం, నిదానంగా జరగడం, ముఖ్యమైన విషయాలందు ఆందోళన చెందడం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. రాబడి స్వల్పంగా పెరుగుతుంది. నిరుద్యోగులకు అవకాశాలుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వాహనాలు నడిపేవారు, విద్యుత్తు, యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తగా మెలగండి. క్రయవిక్రయాలు వాయిదా వేసికొనడం మంచిది. ఆర్థికంగా బాగుంటుంది. వనరులకు డబ్బుకు కలిగిన ఇబ్బందులు తొలగుతాయి. ఆదాయానికి తగిన ఖర్చులు పెట్టక తప్పదు. ముఖ్యపత్రాలు, వస్తువులు, డబ్బును జాగ్రత్త పెట్టుకొనండి. విద్యా ప్రగతి బాగుంటుంది.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కోర్టు కేసులు వాయిదా పడతాయి. బాకీలు నిలబడిపోవచ్చును. తొందరపాటు నిర్ణయాలు, పట్టుదల, కోపం పెరిగి ఇబ్బందిపడే అవకాశం ఉన్నది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి సరిగా ఉండదు. ఆదాయం సామాన్యం. ఇంట, బయట ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగులకు పనిభారం, స్థానమార్పు ఉండవచ్చును. మిత్రులు ఆత్మీయులు మీ ఇబ్బందులకు సహాయపడతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

నిరుద్యోగులకు అవకాశాలు వాయిదా పడతాయి. ఉద్యోగులు విధి నిర్వహణలోను అధికారులతోను జాగ్రత్తగా ఉండండి. కొత్త ప్రణాళికలు పథకాలతో వ్యాపారవృద్ధి ప్రయత్నాలు జరుగుతాయి. వృత్తి జీవనం బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. అయితే అనవసర ఖర్చులు కూడా ఉంటాయి. చేసే పనులు నిదానంగా సాగుతాయి. అనవసర వ్యవహారాలు వదలండి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి. ఉద్యోగులకు కొత్త అవకాశాలు, స్థానమార్పులుంటాయి. జరగవలసిన పనులు టెన్షన్ పెట్టినా సానుకూలం కాగలవు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక ఇబ్బందులు క్రమంగా సర్దుబాటు కాగలవు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. మీ ఆరోగ్యం బాగుంటుంది. అధికారుల సహకారం బాగుంటుంది. శుభవార్తలు వింటారు.

# పవన్ కోసం బాబు మాస్టర్ ప్లాన్

శ్రీను గల్పిక

కేసీఆర్ సీఎంగా వున్న హైదరాబాద్‌లో ఆంధ్రా ముఖ్యమంత్రి, హైటెక్ రత్న చంద్రబాబునాయుడు నివాసం. చంద్రబాబు అప్పుడే నిద్రలేచాడు. అరగంట పాటు ఎదురుగా నరేంద్రమోడీ ఫోటోనుంచుకుని యోగా చేసాడు. ఆ తర్వాత హాల్‌లోకి వచ్చి ఆరోజు వచ్చిన దినపత్రికలు తిరగేసాడు. అన్ని పేజీలను ఆత్రుతగా చూసాడు. ఎక్కడా 'ఓటు-నోటు' కేసుకు సంబంధించిన వార్త లేదు. వెంటనే టీవీ ఆన్ చేసి అన్ని న్యూస్ ఛానెల్స్‌ను ఒకదాని తర్వాత ఒకటి చూసాడు. ఏ ఛానల్‌లోనూ 'ఓటు-నోటు' కేసుపై బ్రేకింగ్ న్యూస్ లేవు. చంద్రబాబు గుండెల మీద చెయ్యేసుకుని హమ్మయ్య ఈరోజుకు ప్రశాంతంగా హైదరాబాద్‌లో గడి పేయవచ్చనుకున్నాడు. తర్వాత కాలకృత్యాలు ముగించి, టిఫిన్ కానిచ్చి తన కోసం చాలామంది వెయిటింగ్‌లో ఉన్నారని తెలిసి హాల్‌లోకి వచ్చాడు. మంత్రులు పి.నారాయణ, బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, పత్తిపాటి పుల్లారావు, రావెళ్ల కిషోర్‌బాబు, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడులతో పాటు ఎంపీలు మురళీమోహన్, గల్లా జయదేవ్‌లు కూడా అక్కడున్నారు. ఏంటి విశేషాలని చంద్రబాబు అడిగాడు. దానికి పత్తిపాటి పుల్లారావు... సార్, ప్రత్యేకహోదా మీద ప్రతిపక్షాలు ఊపు మీదున్నాయి. మనం ఏదో ఒకటి చేయాలన్నాడు. చంద్రబాబు వెంటనే... మనం ఏమీ చేయలేము, కేంద్రం ఏది చేస్తే మనం అది చేయించుకోవాలంతే, ఎక్కువ మాట్లాడితే ఆ బీజేపీ వాళ్లు గెటౌట్ అనేటట్లున్నారు. కాబట్టి ఆ విషయం మరచిపోండని చెప్పాడు. వెంటనే నారాయణ... అదంటే జనానికి, రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన విషయం. దాంతో మనకు అవసరం లేదు. రాజధాని సబ్జెక్ట్ మనకు చాలా ఇంపార్టెంట్. భూసేకరణలో మన టార్గెట్ ఇంకా పూర్తి కాలేదు. ఇంకా నాలుగువేల ఎకరాలు దాకా లోటు పడింది. భూసేకరణ చట్టం ప్రయోగించి రైతులను నలగతన్నయినా భూములు లాక్కుందామంటే ఆ పవన్ కల్యాణ్‌తో పెద్ద చావొచ్చి పడింది. రాజధాని గ్రామాల్లోకి వెళ్లి రైతులను కలబెడుతున్నాడు. వాళ్ల ఏడుపులు చూసి ఈయన రెచ్చిపోయి నన్ను, పత్తిపాటి పుల్లారావును, రావెళ్ల కిషోర్‌బాబును పిచ్చిపిచ్చిగా తిడుతున్నాడని వాపోతుండగా... మధ్యలో మురళీమోహన్ కలుగ జేసుకుని మీతో సరిపెట్టాడా... మమ్మల్ని కూడా దీనిలోకి లాగాడు. రాజధాని భూములకు హైదరాబాద్‌లో నా భూములకు లింకు పెట్టి మాట్లాడుతున్నాడు. కావాలంటే చూడండి... అంటూ అప్పుడే ఓ సి.డి తీసి కంప్యూటర్‌లో పెట్టి ఆన్ చేశాడు.

★★★★★

అది గుంటూరుజిల్లా పెనమాక గ్రామం. ప్రజలంతా గుమికూడి వున్నారు. పవన్ కల్యాణ్ ఆగి ఆగి మాట్లాడుతున్నాడు. నేను చంద్రబాబుకు బానిసను కాను. టైం బాగాలేక ఎన్నికల్లో సపోర్ట్ చేసాను. మీ తలరాతే కాదు, నా తలరాత కూడా మారిపోయింది. చంద్రబాబు సీఎం అయ్యాక నాకు కూడా లేనిపోని మెంటల్ టెన్షన్‌లన్నీ వస్తున్నాయి. ఈ రాజధాని భూముల వ్యవహారం లేకపోతే నా పాటికి నేను సినిమాలు చేసుకుంటుండేవాడిని... ఈ గవర్నమెంటు భూములు లాక్కుంటుండడంతో... సెల్ ఫోన్ వున్న ప్రతోడు... ఏం చేస్తున్నావ్ పవన్, ఏం పీకుతున్నావ్ పవన్, ఎక్కడ దాక్కున్నావ్ పవన్ అంటూ ట్విట్టర్‌లలో, ఫేస్‌బుక్‌లలో ప్రశ్నిస్తున్నారు. ఆ పోరు పడేకంటే ఇలా వీధుల్లో కొచ్చి ప్రభుత్వంపై పోరు సాగించడమే నయమనిపించింది. ఇక మీతోనే వుంటా... మీ భూములకు అండగా ఉంటా.. చంద్రబాబు చివరగా చెబుతున్నా... "అత్తారింటికి దారేది" సినిమాలో డైలాగ్ రిపీట్ చేస్తున్నా... అమ్మితే కొనుక్కోండి, అది వ్యాపారం, కాని లాక్కుంటే దౌర్జన్యం... ఇకనైనా భూములు లాక్కోవడం మానండి... రైతుల భూముల జోలికొస్తే ఖబడ్దార్... అని ముగించాడు.

★★★★★

పవన్ స్పీచ్ అంతా అయిపోయాక మురళీమోహన్ ఉండి... వీళ్ల అన్నకున్న జ్ఞానం కూడా ఇతనికి లేదు. ఎలక్షన్‌లు అయిపోయాక కూడా ప్రజలను పట్టుకుని వూగులాడుతాడేమిటి. ఆ చిరంజీవిని చూడండి, పార్టీని పెట్టాడు, కాంగ్రెస్‌కు అమ్మాడు. హాయిగా కేంద్రమంత్రి పదవిని కూడా అనుభవించాడు. ఇతనికి ఆ మాత్రం తెలివితేటలు లేకుండాపోయాయి... అని అన్నాడు. మంత్రి నారాయణ అందుకుని... అతనిని ఏదో ఒకటి చేయండి సార్, భూసేకరణ విషయంలో ఆ జగన్ కంటే కూడా ఇతను పెద్ద తలనొప్పిలాగా తయారయ్యాడు అని మొర పెట్టుకున్నాడు.

అప్పుడు చంద్రబాబు కూల్‌గా స్పందిస్తూ... నారాయణా, దేనికైనా టైం రావాలి, నా వాడకం ఎలా వుంటుందో అతనికి ఇప్పుడే తెలిసింది. మీరు చీకితే ఐస్‌లో పుల్లయినా మిగులుతుందేమో, నేను చీకితే ఆ పుల్ల కూడా మిగలదు. కొందరు డబ్బుకు లొంగుతారు, కొందరు మద్యంకు లొంగుతారు... పవన్‌కు ఈ రెండూ అవసరం లేదు. ఇక పదవులంటారా... ఇంకా అతను ఆ వ్యామోహంలో పడలేదు. అతనిని మనం రాజధాని భూముల గొడవల్లో తలదూర్చకుండా చేయడానికి ఒకే ఒక్క ఆధారముంది. అది మనం చేయగలిగితే భూసేకరణ పూర్తయినట్లేనన్నాడు. ఏంటదని అందరూ ఆసక్తిగా అడిగారు. చంద్రబాబు మాట్లాడుతూ... అతను ఆ ఫారిన్ అమ్మాయినెవరినో పెళ్లి చేసుకుని ఉన్నాడటగా... మన పవర్ ఉపయోగించి ఆ అమ్మాయిచేత కేసు పెట్టిద్దాం... ఇక ఏడాది దాకా ఈ భూముల గొడవలోకే రాడు అని అన్నాడు. అది విని అక్కడున్న నాయకులంతా... ఓ మా బాబే... నీకు ఒళ్లంతా తెలివే అని మెచ్చుకున్నారు.

## టంగుటూరిపై వక్తృత్వ పోటీలు



పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రత్నమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 22వ తేదీ నెల్లూరు కొండాయపాళెం దళితవాడ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు టంగుటూరి జీవిత చరిత్ర అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు బి.భవాని నాగేంద్రప్రసాద్, ఎస్‌విఆర్ స్కూలు కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, స్కూలు ప్రధానోపాధ్యాయులు యం.భాస్కర్‌రావు, సంస్థ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, ఉపాధ్యక్షులు రవి గోగులపల్లి, ఉపాధ్యాయుడు హరీష్, సభ్యులు కిరణ్‌కుమార్, రామ్‌ప్రభు, యస్.ప్రభాకరరాజు, ఓమంపాటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 10న జడ్పీ సమావేశం

జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 10వతేదీ ఉదయం 10.30గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఇన్‌ఛార్జ్ సిఇఓ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని వారు కోరారు.

# మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకోవాలి




మదర్ థెరిస్సా జీవితం అందరికీ మార్గదర్శకమని, ఆమెను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ సమాజానికి తమవంతు సేవలందించాలని క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం పడారుపల్లిలోని పి.సి.రెడ్డి సమాజమందిరంలో మదర్‌థెరిస్సా జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వికలాంగులకు, వృద్ధులకు అన్నదానం, పండ్లు, స్వీట్లు ఫలసరుకులు పంపిణీ చేశారు. హెల్ప్ సొసైటి అధ్యక్షురాలు కుసుమకుమారి మాట్లాడుతూ యువత చిన్ననాటి నుంచే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాల బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవియస్ నాయుడు, వొమ్మిన సుబ్రహ్మణ్యం, స్వర్ణ గంగాధరం, టి.సుకుమార్ రెడ్డి, గిరిజాకుమారి, ఆర్.లక్ష్మి, రాజగోపాల్‌రెడ్డి, డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లక్షల్లో జీతాలు... విధుల్లో బేజారు

- గ్రామాల ముఖం చూడని ఆరోగ్య కేంద్ర సిబ్బంది
- భయాందోళనలో ప్రజలు



లక్షల్లో జీతాలు తీసుకుంటున్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది ఆయా కేంద్రాలకు సకాలంలో వెళ్లకపోగా, విషజ్వరాలు, వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్న గ్రామాలవైపు కన్నెత్తి కూడా చూడటం లేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి ఆరోపించారు. కావలి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గిరిజన, దళితవాడల్లో ముఖ్యంగా డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాపించి ఉన్నాయన్నారు. అందులో భాగంగానే ఇటీవల బోగోలు మండలం అలిచర్ల బంగారుపాలెంలో ఒక వివాహిత విషజ్వరంతో మృతి చెందిందని తెలియజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారు పరిసరాలను పరిశీలించి వ్యాధులు ప్రబలకుండా ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రాల పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. వ్యాధులు ప్రారంభ దశలోనే నివారించాల్సిన వారు వ్యాధుల తీవ్రత ఎక్కువై ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు కారణం వీరిపై ఉన్నతస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడమేనన్నారు. ఇకనైనా ఉన్నతస్థాయి అధికారులు కలుగజేసుకుని బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే వ్యాధులు ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు గంటా భాస్కర్, విజయరత్నం, కొండయ్య, దాసు, లక్ష్మీనరసు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల జీవితాలు చిందర వందర



కడలిని నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారుల జీవితాలు చిందరవందరగా మారాయి. సముద్రంలోకి వేటకు వెళ్తున్న కడలిపుత్రుల జీవితం దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా మారింది. నాటు పడవలలో వేకువజామున మూడుగంటలకే వేటకు వెళ్లే మత్స్యకారులు వలలోకి చేపలు పడక నిరాశగా ఒడ్డుకు చేరుతున్నారు. తమ భార్యాపిల్లలను పోషించేందుకు గంపెడు ఆశలతో సముద్రంలోకి చేపలు వేటకు వెళ్లి ప్రమాదాలలో చిక్కుకొని ప్రాణాలు పోగొట్టుకున్న జాలర్లు వున్నారు. వీరిని ఆదుకున్న నాధుడే కరువయ్యాడు. వీరు ఒక మోటారుబోటును లక్ష రూపాయలు, ఐలా వలను పది లక్షలు పెట్టి కొని చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ప్రభుత్వం కొన్ని రోజులు వేట నిషేధం అని, ఆ సమయంలో అన్ని విధాల ఆదుకుంటామని చెప్పినప్పటికీ ఏ విధమైన సహాయం చేయలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వేట కోసం వల వేసి వుంచితే తమిళనాడు నుండి వచ్చే పెద్ద బోట్లు తమ వలలను నష్టపరుస్తున్నాయని వారు వాపోతున్నారు. సముద్రం పైనే ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపైన వుంది. చాలీచాలని సంపాదనతో కష్టంగా నెట్టుకొస్తున్న మత్స్యకారుల జీవితాలలో వెలుగు నింపేందుకు ఆర్థికంగా ప్రభుత్వాలు ఆదుకొని వారి కుటుంబాల అభివృద్ధికి ప్రయత్నం చేయాలి.



# రైతులకు సబ్సిడీ ద్వారా విత్తనాలు

## - ఎంఎంసి చైర్మెన్ దేవరాల



త్వరలో రైతులకు సబ్సిడీ ద్వారా విత్తనాలను పంపిణీ చేస్తామని ఎఎంసి చైర్మెన్ దేవరాల సుబ్రమణ్యం చెప్పారు. 22వ తేదీ మద్దూరుపాడులోని ఎఎంసి కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2015–16కు సంబంధించి 54 లక్షల పనుల ప్రతి పాదనలను పంపినట్లు సూపరింటెండెంట్ పాలకవర్గ సభ్యులకు వివరించారు. వైస్ ఛైర్మన్ గంటా లక్ష్మీనరసింహం మాట్లాడుతూ ఎఎంసి ద్వారా రైతులకు ఏమేమి చేయగలవో అధికారులు పాలకవర్గ సభ్యులకు తెలపాలన్నారు. డైరెక్టర్‌లు తిరువీధి ప్రసాద్, సన్నిపోయిన నారాయణలు గత మీటింగ్‌లో పలు అంశాలపై వివరాలు అడిగామని, వాటిని చెప్పలేదని ఎఎంసి సెక్రటరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకవర్గం సమావేశం వివరాలు తమకు అందలేదని, ప్రతివిషయంలోను ఎఎంసి అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఎఎంసి ఛైర్మెన్‌కు ఫిర్యాదు చేశారు. 80లక్షల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరైతే తమకు సమాచారం తెలపకుండా నిర్లక్ష్యం చెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ ఛైర్మెన్ గంటా లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ కావలి ఎఎంసి పరిధిలోని ప్రతి మండలంలో గోడౌన్‌లను నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కలిగిరి పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, దానిని ఎలా ఉపయోగించుకోవాలో చూస్తామన్నారు. ఎఎంసి చైర్మెన్ దేవరాల మాట్లాడుతూ అన్ని శాఖలతో ఎఎంసికి సంబంధాలున్నాయని, సమన్వయంతో పనిచేసి రైతులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. రైతులకు విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందించేందుకు కృషి చేద్దామన్నారు. మార్కెటింగ్ యార్డులో మామిడి వ్యాపారం చేసుకోనేందుకు షెడ్లు నిర్మించి ఇస్తామని, త్వరలో కోల్డ్ స్టోరేజీలను నిర్మించేందుకు అనుమతులు వస్తాయన్నారు. ఎఎంసి పరిధిలోని పశుసంపద ఎక్కువగా వున్న గ్రామాలను సందర్శించి ఉచిత వైద్యసదుపాయలను ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్ రావుల ద్వారా ఎఎంసికి అవసరమైన నిధులను రాబడతామన్నారు. వ్యవసాయ మంత్రి పత్తిపాటి పుల్లారావు జిల్లాకు రానున్నారని, కావలి ఎఎంసికి తీసుకొని వచ్చి ఆయనను ఘనంగా సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డిఇ రవిప్రసాద్, డైరక్టర్‌లు పర్వీన్ జానీ, చక్రపాణి, కె.రామసుబ్బనాయుడు, మస్తాన్‌రెడ్డి, ఎఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కావలి కబుర్లు

# తెల్లదొరల తుపాకులకు గుండె చూపిన బెబ్బులి.. ఆంధ్రకేసరి




భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులకు తన గుండెను చూపించి కాల్చరా అని గర్జించిన వ్యక్తి మన ఆంధ్రకేసరని 25వ వార్డు కౌన్సిలర్ నెల్లూరు సీతారామమ్మ అన్నారు. 22వ తేదీ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఉత్సవాలలో భాగంగా సీర్స్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వెంగళరావునగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు వస్త్రాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నెల్లూరు సీతారామమ్మ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచీ కష్టాలను అనుభవిస్తూ, స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొని సైమన్ గోబ్యాక్ నినాదం ఇచ్చిన వ్యక్తి మన ఆంధ్రకేసరి అన్నారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అగస్త్యరాజు సుబ్బారావు, సీర్స్ వ్యవస్థాపకురాలు రమాదేవి, కాంతి స్టోర్సు నిర్వాహకులు కోటేశ్వరరావు, నెల్లూరు వెంకటేశ్వర్లరెడ్డి, చలపతిరావు, సుందరరావు, శరత్‌చంద్రబాబు, ప్రసాద్‌రావు, ఎచ్‌ఎమ్ పహీముద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదలందరికీ రిజర్వేషన్ వసతి కల్పించాలి



దేశంలో కుల, మతాలకు అతీతంగా ఆర్థికంగా వెనుకబడిన ప్రతి పేదవానికి రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు టంగుటూరి రామకృష్ణ అన్నారు. ప్రపంచం గర్వించదగ్గ మేధోసంపద భారతదేశంలో ఉందని, దానిని వెలికితీయాలని ఆయన సూచించారు. ఈ రిజర్వేషన్ సాధించేందుకై దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు వెళుతున్నామన్నారు. ఇప్పటికే 13రాష్ట్రాల్లో సభలను నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నిజంగా మంచి మార్కులు సాధించిన వారికి అవకాశాలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కులంలో పేదవారున్నారని, వారిలోని ప్రతిభను గుర్తించి కనీసం 15% రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రక్క రాష్ట్రం తమిళనాడు సిటీలోనే 40లక్షల మంది తెలుగుప్రజలు ఉన్నారని, అక్కడ తెలుగుపై ప్రాముఖ్యత తగ్గుతుందన్నారు. తమిళనాడులో కూడా తెలుగు పాఠశాలలను నెలకొల్పాలని ఆయన సూచించారు. రిజర్వేషన్ విషయంపై త్వరలో పెద్దఎత్తున ఢిల్లీలో మహాసభ ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరుస్తామని రామకృష్ణ పేర్కొన్నారు.

## విజయదుర్గా ఆశ్రమంలో

# లక్షకుంకుమార్చన



కావలి సమీపంలోని రాజువారిచింతలపాలెం వద్ద శ్రీశ్రీశ్రీ విజయదుర్గా ఆస్థానపీఠంనందు శ్రీ మన్మథనామ సంవత్సర శ్రావణ మాసంలో 28వ తేదీ శుక్రవారం వరలక్ష్మీవ్రతం సందర్భంగా శ్రీచక్రం మీద లక్ష్మీదేవికి లక్ష కుంకుమార్చన పూజలు ఉచితంగా నిర్వహించబడుతాయని ఆస్థాన పీఠ శాశ్వత ధర్మకర్త శ్రీ పత్రి వీరబ్రహ్మయ్యస్వామి తెలియజేశారు. ఈ పూజలు శుక్రవారం ఉదయం 5.00 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడుతాయన్నారు. పూజ అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

# వీనుల విందుగా వాగ్గేయకార గానామృతం




భారతీ సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ నెల్లూరు టౌన్‌హాల్లో నిర్వహించిన వాగ్గేయకార గానామృతం శాస్త్రీయ సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. సంస్థ అధినేత ఎ.రమాదేవి శిష్యులు లావణ్య, హితేష్, హరికృష్ణ, హంసిని, హర్షితసాయి, ఆశ్రితసాయి తదితర విద్యార్థులు ఆలపించిన వివిధ వాగ్గేయకారుల విరచిత కీర్తనా గోష్ఠిగానం సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కావలి మార్కెటింగ్ కమిటి అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యం, నెల్లూరు కిమ్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.రఘురామ్ గుప్తా, ప్రముఖ శాస్త్రవేత్త ఏ.జగదీష్, త్యాగరాజ స్మరణోత్సవసభ శాశ్వత కార్యదర్శి డా॥ వై.నాగదేవి ప్రసాద్‌లు పాల్గొన్నారు. కళాంజలి అనంత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా దువ్వూరు బెనర్జి, కిషోర్‌లు వ్యవహరించారు.

# కొత్తూరులో 'పులిరాజా ఐపిఎస్'



ప్రముఖ సినీనటుడు చంద్ర మోహన్, సినీ హీరో రాంబాబు తదితర నటులు ఆదివారం ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరుకు విచ్చేశారు. మాధవ్ ఆర్ట్ క్రియేషన్స్‌పై రూపొందుతున్న 'పులిరాజా ఐపిఎస్' చిత్రం షూటింగ్‌లో వీరు పాల్గొన్నారు. ఈ చిత్ర నిర్మాణం కోసం వారం రోజుల పాటు కొత్తూరు పరిసరాల్లో షూటింగ్ నిర్వహించనున్నట్లు ప్రముఖ సినీ దర్శకులు రాఘవ తెలిపారు. తొలిరోజున నటుడు చంద్రమోహన్, హీరో రాంబాబు మరికొంతమంది జూనియర్ ఆర్టిస్టులతో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. కొత్తూరులోని శ్రీ సాయిబాబా దేవాలయంలోకి చంద్రమోహన్ వెళ్ళడం, సాయినాథుని దర్శించుకోవడం తదితర సన్నివేశాలను చిత్రీకరించారు. తమిళంలో ప్రముఖ హీరో రాంబాబు, నవదీప్‌పైనీ ఈ చిత్రంలో నటిస్తున్నారు.

కొత్తూరు సమీపంలోని తోటల్లో, ముఖ్యంగా ఆకుతోటలు, అరటితోటలు, కొబ్బరి తోటలు, పంటపొలాలతో ప్రకృతి రమణీయత కొలువై వున్న పలు ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహిస్తున్నారు. మైపాడు బీచ్ తదితర ప్రాంతాల్లో కూడా షూటింగ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. తండ్రి కోరికను కుమారుడు ఎలా తీరుస్తాడో అనే కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోందని, ఆద్యంతం వినోదాత్మకంగా ఈ చిత్రం సాగుతుందని దర్శకుడు తెలిపారు. ఈ షూటింగ్ చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు కొత్తూరుకు విచ్చేశారు. దీంతో, కొత్తూరు ప్రాంతం సినీనటుల సందడితో ఆహ్లాదంగా వుంది.

# అమోఘం.. శాస్త్రీయ నృత్యాభినయం

సంస్కృతి తరంగాలు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీలు ప్రేక్షకులను సమ్మోహితుల్ని చేసాయి. సోమవారం ఉదయం నుంచి జరిగిన ఈ పోటీల్లో కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఆంధ్రనాట్యం, జానపదం విభాగాల్లో దాదాపు 60మంది చిన్నారులు పోటా పోటీగా తమ ప్రతిభను కనబరిచారు. 'సంస్కృతి తరంగాలు' వ్యవస్థాపకుడు రేణి గుంట రాజశేఖర్ ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ కళలు సమాజాన్ని చైతన్యవంతం చేసే సాధనమని, ప్రతిభావంతులైన కళాకారులను ప్రోత్సహించేందుకు నవ్యాంధ్ర రాష్ట్ర స్థాయి నృత్యపోటీలను నిర్వహించామన్నారు. పోటీల ప్రారంభం సందర్భంగా చిన్నారి సుమేధ శాస్త్రీయ నృత్యప్రదర్శన సభికులను ఆకట్టుకుంది. దేగల సాంబశివరావు బృందం





ప్రదర్శించిన 'వినాయక విజయం' నృత్య రూపకం, బాడిగ అనీల్‌కృష్ణ, కొత్త దుర్గా భవాని బృందం ప్రదర్శించిన 'తెలుగు వైభవం' నృత్యరూపకం విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కావలి మార్కెటింగ్ కమిటి అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యం, టివి నటుడు సూర్య, సూళ్లూరుపేట మునిసిపల్ ఛైర్మెన్ నూలేటి విజయలక్ష్మి, కార్పొరేటర్ దేవరాల మస్తానమ్మ, ప్రముఖ సంగీత విద్వాంసురాలు రాళ్లపల్లి సుబ్బులక్ష్మి పాల్గొని విజేతలకు బహుమతులు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

## నెల్లూరులో ప్రత్యేకహోదా ఆత్మహత్య



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా రాలేదనే మనస్థాపంతో నెల్లూరులోనూ ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నెల్లూరు, వేదాయపాలెంలో ఉంటున్న రామిశెట్టి లక్ష్మయ్య(56) 27వ తేదీ ఉదయం తానుంటున్న ఇంట్లో ఉరేసుకుని చనిపోయారు. ఆత్మహత్యకు ముందు ప్రత్యేకహోదా విషయంలో తన బాధను వ్యక్తపరుస్తూ లెటర్ వ్రాసిపెట్టాడు. లక్ష్మయ్య 2007 వరకు హౌసింగ్ కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత చిన్నచిన్న పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నాడు. వికలాంగుడైన లక్ష్మయ్యకు కొడుకు, కూతురు ఉన్నారు. గత కొంత కాలంగా అతను అనారోగ్యంతోనూ బాధపడుతున్నట్లు తెలిసింది. జిల్లాలోని రాజకీయ నాయకులు, వివిధ సంఘాల వారు లక్ష్మయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# శ్రీ దత్తసాయి మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి

నెల్లూరులోని కొండాయపాళెం గేటువద్ద రవీంద్రనగర్ 2వ వీధిలో వెలసివున్న శ్రీ దత్తసాయి భజన మందిరంలో సెప్టెంబర్ 5వ తేదిన శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అఖండ సాయినామ సంకీర్తన జరుగుతుందని, భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని సాయినాథుని కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలకు మాగుంట వెంకటనారాయణరెడ్డి-శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని, ఆరోజున ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు వుంటాయని వారు పేర్కొన్నారు.

# మెగా డ్రామా!

(మొదటి పేజీ తరువాయి)

పండుగలా జరిపారు. పెద్దఎత్తున హంగామా చేసారు. హైదరాబాద్‌లో అయితే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలంతా కూడా చిరంజీవిని పొగడడమే పనిగా పెట్టుకున్నారు. మెగా ఫ్యామిలీ అంతా ఒకే తాటి మీద వుందన్న ఫీలింగ్‌ను కల్పించే ప్రయత్నం చేసారు. చిరంజీవి బర్త్‌డే పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు పవన్ కల్యాణ్ తప్ప మిగతా మెగా కుటుంబసభ్యులంతా హాజరయ్యారు. ఒక కార్యక్రమంలో అయితే నాగబాబు వీరావేశంతో మాట్లాడాడు. పవన్ కల్యాణ్‌కు తమకు మధ్య కొందరు అపోహలు సృష్టించాలని చూస్తున్నారని, పవన్ కల్యాణ్‌ను హీరోని చేసింది చిరంజీవేనని, ఆయన కూడా మాతో వస్తాడని చెప్పుకొచ్చాడు. పక్కరోజు ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో చిరు ఇచ్చిన విందుకు పవన్‌కల్యాణ్ హాజరుకావడం జరిగింది. ఇదే విందుకు అభిషేక్‌బచ్చన్, జయాబచ్చన్ వంటి వారితో పాటు అనేకమంది ప్రముఖులు హాజరయ్యారు.

చిరంజీవి 60వ జన్మదినోత్సవాన్ని ఇంత ఆర్భాటంగా నిర్వహించడం వెనుక పలు కారణాలు కనిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో చిరంజీవి ప్రాభవం తగ్గిపోయింది. కాంగ్రెస్‌లో చేరాక ఆయన ప్రతిష్ట మసకబారింది. ఇప్పుడు రాష్ట్రంలో తెలుగుదేశం, వైకాపాలే వున్నాయి. కాంగ్రెస్‌కు దిక్కులేదు. చిరంజీవికన్నా పరపతిలో పవన్‌కల్యాణ్ నయం. చిరంజీవిని మళ్లీ ఫోకస్‌లోకి తేవాలంటే వున్న ఏకైక మార్గం 150వ సినిమా! ఆయన బర్త్‌డే వేడుకలలో ఈ 150వ సినిమాకే ఎక్కువ ప్రచారం కల్పించారు. నెక్స్ట్ ప్రమోషన్ కోసమే చిరంజీవి బర్త్‌డే స్టంట్‌ను ప్రయోగించారని తెలుస్తోంది.

# హోదా వద్దు.. ప్యాకేజీ ముద్దు!

(మొదటి పేజీ తరువాయి)

విభజన సమయంలో కాంగ్రెస్ ద్రోహం చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ చేసిన ద్రోహం మరుగునపడేలా బీజేపీ వ్యవహరిస్తోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అసలు ప్రత్యేకహోదా అంశాన్నే పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదన్న సంకేతాలు వారి నుండి ఎప్పటినుండో స్పష్టంగా అందుతున్నాయి. వాళ్ల రాజకీయ కారణాలు వాళ్లవి. త్వరలో బీహార్ ఎన్నికలున్నాయి. అక్కడ కూడా ప్రత్యేకహోదా డిమాండ్ వుంది. ఏపికి ఇచ్చి బీహార్‌కు ఇవ్వకుంటే అక్కడ ఎన్నికల్లో బీజేపీకి నష్టం కలగొచ్చు. ఏపి పక్కనే తమిళనాడు వుంది. ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే ఆ ప్రభావం ప్రధానంగా పడేది తమిళనాడు మీదే! ప్రత్యేకహోదా వస్తేనే తమిళనాడులోని పరిశ్రమలన్నీ సరిహద్దుల్లోని నెల్లూరు, చిత్తూరుజిల్లాల వైపు తరలే అవకాశముంది. ఈ ప్రమాదాన్ని పసిగట్టే తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఏపికి ప్రత్యేకహోదా రాకుండా అడ్డు తగులుతుంది. నరేంద్ర మోడీతో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయి. లోక్‌సభలో, రాజ్యసభలో బీజేపీకి అన్నాడిఎంకె మద్దతు అవసరం. ఈ దృష్ట్యా కేంద్రంపై ఆమె పలుకుబడి కూడా పనిచేస్తుండొచ్చు.

ఏపికి ప్రత్యేకహోదా రాకుండా ఎవరి స్థాయిలో వాళ్లు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రత్యేకహోదా సాధించడానికి పోరాడాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏం చేస్తున్నారన్నదే ప్రశ్న. ఆయన ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు. అయితే ప్రత్యేకహోదా కోసం మాత్రం కాదు. స్పెషల్ ప్యాకేజీ కోసం. ప్రత్యేకహోదా కోసం ఇంతవరకు చంద్రబాబు వైపు నుండి గట్టి ప్రయత్నమే జరగలేదు. ఒక్కసారన్నా గట్టిగా కేంద్రాన్ని అడిగింది కూడా లేదు. ప్రత్యేకహోదా కంటే ఆయన మనసంతా ప్రత్యేకప్యాకేజీ మీదనే వుంది.

ప్రత్యేకహోదా వస్తే ఏమవుతుంది... పరిశ్రమలు వస్తాయి, పన్నులు తగ్గుతాయి, గ్రాంట్‌లలో సబ్సిడీ వస్తుంది. దీనివల్ల రాష్ట్రం బాగుపడుతుంది. ప్రజలు ప్రయోజనం పొందుతారు. కాని తెలుగుదేశం వారికేం ప్రయోజనం. అదే ప్యాకేజీ అంటే. బీహార్‌కు ఇచ్చినట్లు లక్షాపాతిక వేల కోట్లు ఇచ్చినా... కళ్లు తిరిగే కమీషన్ ఖాయం. ప్రతి పనిలోనూ 10శాతం కమిషన్ అనే సంప్రదాయం ఎప్పట్నుండో వుంది. అది ఈమధ్య ఇంకా పెరిగింది. లక్షకోట్ల ప్యాకేజీ వచ్చినా తెలుగు సోదరులకు చేతినిండా చిల్లర కనిపిస్తుంది. అదే స్పెషల్ స్టేటస్ అయితే వీళ్ల చేతికొచ్చేదేమీ వుండదు.

అందుకే ప్రత్యేకహోదా కంటే ప్రత్యేక ప్యాకేజీ కోసమే చంద్రబాబు పాకులాడుతున్నట్లుగా తెలుస్తోంది.

# భూ దందాకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని అనగానే మా భూములెందుకిచ్చాంరా దేవుడా అని బాధపడే సందర్భం రాకపోదు. బ్రతుకుదెరువును అంతగా దెబ్బతీయబోతుంది ఈ రాజధాని వ్యవహారం.

రాజధాని పేరుతో సాగుతున్న ఈ భూదందాకు బ్రేక్ వేయగలిగింది ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డే! ఎలాగూ ఈ రాజధానిని ఇక మూడేళ్లలో కట్టేది లేదు. పెట్టేది లేదు. కొన్ని భవనాలు కడతారు, కొన్ని రోడ్లు వేస్తారు. ఇంతవరకు జరిగితే గొప్ప. రాజధాని కట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవు. కేంద్రం పెద్దగా ఇచ్చే పరిస్థితి లేదు. కాబట్టి ఎక్కడి భూములు అక్కడ ఉండాల్సిందే. జగన్ చేయాల్సింది రైతులకు ధీమా కల్పించడం. తాము అధికారంలోకి వస్తే ఎవరి చేతుల్లో ఉన్నా రాజధానికి సేకరించిన భూములను తిరిగి రైతులకే అప్పగిస్తామని చెప్పడం. రాజధానికి వాడని భూములన్నింటినీ తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇవ్వడం. జగన్ నోటి నుండి గట్టిగా ఈ మాటవస్తే రాజధాని పేరుతో జరిగే రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కొంతన్నా బ్రేక్ పడుతుంది. రాజధానికి 5వేల ఎకరాలు చాలని నిపుణులంతా చెబుతున్నారు. కాబట్టి జగన్ ఆ సూచనతో మిగిలిన భూమిని రైతులకే ఇచ్చేస్తామంటే, సీన్ రివర్స్ అవుతుంది. భూముల మీద ఆశతో కొత్త రాజధానిలో అడుగుపెట్టాలనుకున్న స్వదేశీ, విదేశీ కంపెనీలు కూడా కొంత వరకు ఆలోచనలో పడే అవకాశాలున్నాయి.



# కారణజన్ముడు ప్రభాకరుడు

## • వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కీర్తిస్తున్న నెల్లూరీయులు

**అవును... ఆయన కారణజన్ముడు. పేదవారిని ఆదుకోవడానికి అవతరించిన అపర దానకర్ణుడు. అన్నార్తుల ఆకలి తీరుస్తున్న అన్నదాత. అటు విద్యారంగం ఇటు సేవారంగంలో తన సేవలను గుబాళింపజేస్తూ నేడు ఆధ్యాత్మిక రంగంలో సైతం అత్యంత అరుదైన అపురూప కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాల పేరుతో నిర్వహించిన అపార దైవభక్తుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.**

ఈ మాటలు ఇప్పుడు యావత్ నెల్లూరు జిల్లా అంతా వినిపిస్తున్నాయి. ఒక్క నెల్లూరే కాదు ప్రక్కజిల్లాలైన చిత్తూరు, కడప, ప్రకాశం జిల్లాల్లో కూడా ఆయన పేరు తెలిసిపోయింది. కోట్ల రూపాయల ఖర్చుతో తిరుమలేశుని అన్ని సేవలను నెల్లూరుజిల్లా వాసులకు చూపించిన ఆయన కీర్తి ఇప్పుడు ప్రక్క జిల్లాలకు కూడా విస్తరించింది. ఆయన వందజన్మల పుణ్యం చేసుకున్నాడు, మరో వంద జన్మల పుణ్యాన్ని ఇప్పుడు సంపాదించుకున్నాడు అంటూ ఆధ్యాత్మిక ప్రియులు ఆయనను వేనోళ్ల పొగుడుతున్నారు. తిరుమలలో స్వామివారి చెంత పనిచేసే అర్చకులు సైతం దర్శించుకోలేని ఉదయాస్తమాన సేవలన్నీ అతి సామాన్యుడికి చూపించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ధన్యజీవి, పుణ్యజీవి అంటూ, ఆయన జన్మకు సార్ధకత చూపించుకోవడమే కాకుండా కొన్ని లక్షల మందిని స్వామివారి సేవలో తరింపచేశాడంటూ ఆయనకు జేజేలు పలుకుతున్నారు.





9రోజుల పాటు నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో నభూతోనభవిష్యత్ అన్న రీతిలో స్వామివారి వైభవోత్సవాలను నిర్వహింపజేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఆగష్టు 25వతేదీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నెల్లూరులోని మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపంలో వేద పండితులు ఆశీర్వాదాలను అందజేశారు. హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అనేకమంది ఆధ్యాత్మిక సేవాతత్పరులు, స్వామివారి భక్తులు, ప్రభాకర్‌రెడ్డి అభిమానులు పాల్గొని ఆయనను అభినందించారు.

ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులను తిరుమల నుండి ప్రత్యేకంగా విచ్చేసిన అర్చకబృందం వేద మంత్రోచ్ఛరణలతో ఆశీస్సులను అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మ ప్రచారపరిషత్ కో–ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో మురళీకృష్ణ హోటల్స్ అధినేత గ్రోసు గోపాలయ్య, 'లాయర్' వారపత్రిక సారధి తుంగా శివప్రభాత్‌రెడ్డి, హిందూధర్మ ప్రచారపరిషత్ అధ్యక్షుడు సి.వి.సుబ్రహ్మణ్యం ముఖ్యఆహ్వానితులుగా పాల్గొనగా కార్యక్రమం ఆద్యంతం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభిమానుల కరతాళధ్వనుల మధ్య కొనసాగింది. వివిధ సేవాసంస్థల పక్షాన పలువురు వక్తలు తమ అభినందనలను ప్రభాకర్‌రెడ్డికి అందించగా మురళీకృష్ణ హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ వీరిశెట్టి హజరత్‌బాబు కార్యక్రమం మొత్తాన్ని పర్యవేక్షించారు. అభినందన కార్యక్రమానికి ముందు 'కళాంజలి' అనంత్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయని శ్రీమతి లక్ష్మీప్రసన్న శిష్యులు ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు వీనులవిందు చేశాయి. కార్యక్రమ అనంతరం మురళీకృష్ణ గోపాలయ్య అందజేసిన అన్నప్రసాదాలు అందరినీ సంతృప్తి పరిచాయి.

జిల్లా నలుమూలల నుండి ఒక తిరునాళ్ళకు వచ్చినట్లుగా జనం తరలివచ్చి శ్రీ వెంకటేశ్వర వైభవాలను తిలకించడం నెల్లూరు జిల్లా ఆధ్యాత్మిక రంగంలోనే ఓ సంచలనం. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో ఇంకా అనేకం చేసే శక్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ముక్కోటి దేవుళ్ళు ప్రసాదించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరుమల తిరుపతి దేవస్థానాల అర్చకులు పేర్కొనడం విశేషం.

ఇక ఈ కార్యక్రమంలో బి.వి.నరసింహం వ్యాఖ్యానం షరామామూలే!







## • నెల్లూరునెక్స్ట్

# ముందడుగు



పబ్లిక్ ప్రయివేట్ భాగస్వామ్యంతో నెల్లూరుజిల్లాని అభివృద్ధి వైపు నడిపించాలనే లక్ష్యంతో తమ కుమార్తె దీపావెంకట్ ఇచ్చిన ఆలోచన స్ఫూర్తితో "నెల్లూరు నెక్స్ట్" అనే కార్యక్రమానికి రూపకల్పన చేసి... ప్రపంచ వ్యాప్తంగా వున్న నెల్లూరీయులను ఈ మహాయజ్ఞంలో భాగస్వాముల్ని చేయాలన్న కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడి కలలు సాకారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి.

ఇప్పటికి మూడు పర్యాయాలు జరిగిన సమావేశాలకు భిన్నంగా 4వ సమావేశం ఆగస్టు 25వ తేదీ మంగళవారం నెల్లూరుజిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. శ్రీమతి దీపావెంకట్‌తో పాటు జిల్లా కలెక్టర్ శ్రీమతి జానకి, జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్‌లతో పాటు కమిటి ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డా॥ జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కొన్ని కీలక విభాగాలను ప్రభుత్వ విభాగాల నుండి సమన్వయకర్తలను నియమించారు.

జిల్లా కలెక్టర్ గౌరవాధ్యక్షురాలుగా కొనసాగే ఈ కమిటీతో సమన్వయ పరుచుకుంటూ వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ అధికారులు కూడా జిల్లా అభివృద్ధికి "నెల్లూరు నెక్స్ట్" టీమ్‌తో కలిసి పనిచేసే విధంగా ప్రణాళికలను రూపొందించారు.

ఉదాహరణకు విద్యారంగానికి సంబంధించిన కమిటితో జిల్లా విద్యాశాఖాధికారి, క్రీడా రంగానికి సంబంధించి జిల్లా స్పోర్ట్స్ అథారిటి, వైద్య ఆరోగ్యానికి సంబంధించి డిఎం అండ్ హెచ్ఓ, అలాగే నగరాభివృద్ధికి మునిసిపల్ కమిషనర్... ఇలా ఒక్కొక్క విభాగానికి సంబంధించి ఆయాశాఖలకు చెందిన ముఖ్యఅధికారులను ఈ కమిటీకి జతచేశారు.

మొత్తం 9 అంశాలపై సుధీర్ఘంగా జరిగిన చర్చలో తక్షణం పరిష్కరించవలసిన సమస్యలలో ఒక్కొక్క రంగానికి సంబంధించి మూడు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సమస్యలను ప్రభుత్వపరంగా లేదా ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో ఎలా పరిష్కరించగలమో ఎంత త్వరగా పరిష్కరించగలమో ఆలోచించి తక్షణమే చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

ఉదయం పదిన్నర గంటల నుండి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు జరిగిన సుదీర్ఘ సమావేశంలో జరిపిన చర్చలను పరిగణనలోకి తీసుకుని ఈ సందర్భంగా వచ్చిన కీలక సూచనలను వాటిలో ముఖ్యమైన అంశాలను మధ్యాహ్నం తరువాత జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటి సమావేశంలో చర్చించుకున్నారు. తక్షణమే అవసరమైన చోట చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు.

మొత్తానికి వెంకయ్య, దీపమ్మల ప్రయత్నాలు నిదానంగా ఫలించి మంచి ఫలితాలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఆల్ ది బెస్ట్ టూ 'నెల్లూరు నెక్స్ట్' టీమ్.

FREEDOM SALE
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
FLAT 50% off | FLAT 30% off
అన్ని రకాల వస్త్రాలపై
(ఆఫర్ చివరి 3 రోజులు మాత్రమే)
ఆంధ్రప్రదేశ్
కళానికేతన్®
షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్. 2316677
*Conditions Apply.
doocreative.com

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com